Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

| గురువారం, ఏప్రిల్ 03, 2025 | సంపుటి - 20 | సంచిక 181 | వెల - 4రూ | పేజీలు - 12 |
| --- | --- | --- | --- | --- |

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

### సమయాన్ని పొడిగించిన యాజమాన్యం



హైదరాబాద్ : హైదరాబాద్ నగరవాసులకు మెట్రో సేవలు ఎంతో కీలకంగా మారాయి. ఎందుకంటే నగరంలో ఏ ప్రదేశానికి వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్య వల్ల చాలా సమయం పడుతుంది. అదే మెట్రోలో వెళితే.. నిమిషాల్లో వెళ్లవచ్చు. అందుకే చాలా మంది మెట్రోలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మెట్రో సేవల సమయాన్ని పొడిగించాలని ఎప్పటి నుంచే డిమాండ్ చేస్తున్నారు. మన భాగ్యనగరంలో తక్కువ కాలంలోనే పాపులర్‌గా మారిన మెట్రో రైలు సర్వీసులు విషయంలోనూ అనేక మంది ప్రయాణికులు రాత్రి 12 గంటల వరకు సేవలు సేవలు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

మిగతా 2లో

# ఎక్కడా చెట్లను నరకవద్దు

### సెంట్రల్ వర్సిటీ భూములపై విచారణ

### నేటికి వాయిదా వేసిన హైకోర్టు




హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ భూముల్లోని చెట్లను గురువారం వరకు కొట్టివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరపు సీనియర్ కౌన్సిల్ రవిచంద్.. తన వాదనలు వినిపించారు. జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ వాదనలు జరిగాయి. వట ఫౌండేషన్ తరపున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా టీజీఐఐసీకి భూములు అప్పగించారని తెలిపారు. ఈ భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ భూమిని జాతీయ ఉద్యానవనంగా గుర్తించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు.

మిగతా 2లో




## ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

### విద్యార్థులను చితకబాదిన పోలీసులు

హైదరాబాద్ : హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

### క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



హైదరాబాద్ : వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. అక్కడక్కడా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నా ఇప్పటికే అనేక చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా ఉంటోంది.

## తెలంగాణలో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

### ఏప్రిల్ 30 వరకు పెంచుతే ఆదేశాలు

హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఆదేశించింది.

2లో



## లోక్‌సభలో వక్ఫ్ చట్టసవరణ బిల్లు

### చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

### లేకుంటే పార్లమెంట్ స్థలం కూడావక్ఫ్‌దే అంటారు

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో

2లో

## మెదక్ జిల్లా ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

### నియోజకవర్గానికి లక్షమంది తరలింపు

### రజతోత్సవాలపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు

### మెదక్, నిజామాబాద్ నేతలకు కెసిఆర్ సూచన



గజ్వేల్ : భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించా లన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు-చూసుకోవాలని నేతలకు సూచించారు.

2లో



## రాహుల్ ఆదేశాల మేరకు బిసి కులగణన

### మా రాష్ట్రంలో ఆమోదించిన బిసి బిల్లును ఆమోదించండి

### గుజరాత్‌లో అమలుచేయాలని మేం కోరడం లేదు

### మా డిమాండ్‌కు మీరు మోకాలడ్డవద్దు

### జంతరమంతర్ బిసి ధర్నాలో సిఎం రేవంత్ రెడ్డి

**బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు.**

న్యూఢిల్లీ : పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కుటగణన చేపట్టామని అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరాగాంధీ దళిత్ కాదని..

మిగతా 2లో

## పలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం : వాతావరణశాఖ

హైదరాబాద్ :

మధ్య మహారాష్ట్ర దాని పరిసర ప్రాంతాలలో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. మధ్య మహారాష్ట్ర దాని సమీప ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరీన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9 ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. ఇవాళ(బుధవారం) రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురవనుండగా..

మిగతా 2లో

## ముగిసిన పదో తరగతి పరీక్షలు



హైదరాబాద్ : విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకోగా.. మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు న్విహించిన ఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నేడు సోషల్ స్టడీస్ పరీక్షతో పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. కాగా, పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ నెల చివరి వారంలో విడుదలకానున్నాయి. ఓరియంటల్ సైన్స్‌కు సంబంధించిన రెండు పరీక్షలు ఈ నెల 3, 4 తేదీల్లో జరుగుతాయి. వాటికి కొద్ది మంది మాత్రమే హాజరవుతారని అధికారులు తెలిపారు.

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సహకరించండి

### పెట్టుబడులతో ముందుకు వస్తే అభివృద్ధి సాధ్యం

### నూతన ఆవిష్కరణలకు ఎపి హబ్ కావాలి

### పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో భేటీలో చంద్రబాబు



అమరావతి :

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ని తీర్చిదిద్దేందుకు... 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగా పారిశ్రామిక వేత్తలు రావాలని, నూతన ఆవిష్కరణలకు ఏపీ హబ్ కావాలని, అదే స్థాయిలో పెట్టుబడులు కూడా ఆశిస్తున్నామని అన్నారు. అందిరిలో స్ఫూర్తి నింపేందుకే ఇన్నోవేషన్‌కు హబ్‌కు రతన్ టాటా వంటి గొప్ప వ్యక్తి పేరు పెట్టామని చెప్పారు. బుధవారం సచివాలయంలో పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' గురించి ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఆర్టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటా గ్రూపు, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సహా మరికొందరు ప్రముఖులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. భారతీయులు దేశవిదేశాల్లో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగారని, అలాగే తలసరి ఆదాయంలోనూ విదేశీయులు కన్నా ఎక్కువ ఆర్జిస్తున్నారని, వారిలో 30 శాతం తెలుగు ప్రజలు ఉన్నందుకు తనకు గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. నిజానికి ఇప్పుడు తెలుగు ప్రజలు ఈ స్థాయికి చేరుకోవడానికి తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు తీసుకువచ్చిన సంస్కరణల ఫలితమని చెప్పారు.

మిగతా 2లో

## మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

ఎట్టకేలకు అది నెరవేరింది. ప్యాసింజర్లకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది హైదరాబాద్ మెట్రో. మెట్రో రైల్ సమయం పొడిగించారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ సమయాన్ని పొడిగించారు హైదరాబాద్ మెట్రో అధికారులు. మారిన టైమింగ్స్ ప్రకారం.. ఇక మీదట సోమవారం నుంచి శుక్రవారం వరకు.. ఆయా టెర్మినల్ స్టేషన్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో రైలు ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటల 45 నిమిషాల దాకా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. శనివారం నాడు ఆయా టెర్మినల్ మెట్రో స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు తొలి మెట్రో స్టార్ట్ అవుతుంది. రాత్రి 11 గంటల వరకు రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక నుంచి ఆదివారం నాడు ఉదయం 7 గంటలకు ఆయా టెర్మినల్ స్టేషన్ నుంచి ఫస్ట్ మెట్రో రైలు మొదలవుతుంది. సండే కూడా రాత్రి 11 గంటల వరకే రైళ్ల రాకపోకలు ఉంటాయి.

## ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

ఇక బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళ్లుమనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నా యంటే సూర్యుడి విశ్వరూపం అర్థంచేసుకోవచ్చు. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ సెకండ్ వీక్ తర్వాత నిప్పుల కుంపటేనని హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కూలర్లు, ఎసిల మోతలు వినిపిస్తున్నాయి. సాధారణం కంటే 2,3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో క్రమంగా ఉష్ణోగ్రతల పెరుగుదల కనినిస్తోంది. తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మంచినీరు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని.. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని చెబుతున్నారు. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

## పలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం : వాతావరణశాఖ

వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు వాతావరణ శాఖ అధికారులు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలోని కొన్ని జిల్లాలలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం గరిష్టంగా ఆదిలాబాద్‌లో 41 కనిష్టంగా రామగుండంలో 35.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మంగళవారం తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, భద్రాచలం, రామగుండం, హైదరాబాద్, ఖమ్మం, రామగుండం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయింది.

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### పౌర విమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం

న్యూఢిల్లీ : ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసేందుకు తలపెట్టిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పౌరవిమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకరించింది. భారత ఎయిర్ ఫోర్స్ నుంచి అనుమతులు రావడంపై జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పరిగణలోకి తీసుకుంది. పౌర విమానయానానికి, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించింది. పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వే పునర్నిర్మాణం, పౌర టర్మినల్, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ , ఇతర మౌళిక వసతులను అభివృద్ధి చేయాలని తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఏఐఎఫ్ డైరెక్టర్ లేఖ రాసింది. మరోవైపు.. వరంగల్ నగర సమీపంలోని మామూనూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి, విమాన సర్వీసుల పునరుద్ధరణకు అడ్డంకులు తొలగిపోయిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో ఎయిర్‌పోర్టు ఉండకూడదనే నిబంధన రద్దయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (హెచ్‌ఏఐఎల్)ను నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో ఒప్పందం అనంతరం ఈ నిర్ణయం జరిగిందని పేర్కొన్నది. రాష్ట్రంలో మరో రెండు విమానాశ్రయలు నిర్మాణం కానుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఎక్కడా చెట్లను నరకవద్దు

2003లో 400 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకడమిక్ భారత్‌కు విక్రయించారని వివరించారు. అంటే.. 5-8-2003లో నాడు ఎకరా భూమిని రూ. 50 వేలకు విక్రయించారని తెలిపారు. ఆ సమయంలో ఒక ఎకరం భూమి రూ. 26 లక్షలు విలువ ఉంటే.. కేవలం రూ. 50 వేలకు విక్రయించారని హైకోర్టు దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు. ఇక 2006లో ప్రభుత్వం మారగానే ఈ భూముల విక్రయం.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. నాటి నుంచి ఐఎంజీ భారత్ కోర్టులో ఈ భూమి కోసం పోరాడుతుందని గుర్తు చేశారు. ఐఎంజీ కేసులో ఇప్పటి వరకు ఈ భూమి ఫారెస్ట్ ఏరియా అని ఒక్క వాదన కూడా జరగలేదని..ఈ విషయాన్ని గమనించాలని హైకోర్టును ఆయన కోరారు. అలాగే ఈ భూమి ఎక్కడా ఫారెస్ట్ ఏరియాగా ప్రభుత్వం నోటిపై చేయలేదన్నారు. ఇక గూగుల్ మ్యాప్‌లో మాన్సన్ ఏరియా బట్టీ-ఫారెస్ట్ ఏరియాగా కనిపిస్తుందని కోర్టుకు తెలిపారు. ఇది కేవలం ఇండస్ట్రీ భూమి మాత్రమేనని.. ఇది ఫారెస్ట్ ఏరియా మాత్రం కానే కాదని ఆయన వివరించారు. ఇక్కడ హెలిప్యాడ్‌లు సైతం నిర్మించారని గుర్తు చేశారు. డిఫెన్స్ మినిస్టర్ వచ్చినా ఇక్కడే హెలికాప్టర్ ల్యాండ్ అవుతుందని కోర్టుకు ఆయన విన్నవించారు. ఈ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి  వాయిదా వేసింది. గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఈ కేసును విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వరకు ఆ భూమిలో ఎటువంటి చెట్లు నరకవద్దని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## రాహుల్ ఆదేశాల మేరకు బిసి కులగణన

కానీ ఆమె అందరికీ భూములు ఇచ్చారని.. ఇళ్లు  కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ రాష్ట్రంలో చేయమని మేము అడగలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని సిఎం రేవంత్ అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు- 'అయిననూ హస్తిన పోయి రావలె'.. అన్నట్లు ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నాను' అని రేవంత్ అన్నారు. రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారన్నారు. ట్రిపుల్ తలాఖ్ తెచ్చారని.. ఆర్టికల్ 370 రద్దు చేశారని... వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చిందని ప్రశ్నించారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారని.. 'మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ గర్జన మహా ధర్నాకు వివిధ పార్టీల ఎంపీలు మద్దు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, డీఎంకే కనిమొలి, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే మహాధర్నాకు మద్దతు ఇస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అలాగే ఈ ధర్నాకు ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బిర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, విహెచ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ హాజరయ్యారు.

## లోక్‌సభలో వక్ఫ్ చట్టసవరణ బిల్లు

ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకుని రాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతిచ్చేవారు, వ్యతిరేకించే వారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది. ఇక ఈ వక్ఫ్ బోర్డు విషయంతో తాము క్లియర్‌గా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆ క్రమంలో కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లలో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండాలని నిర్ణయించామన్నారు. అలాగే ఈ వక్ఫ్ బోర్డులల్లో ముస్లిం మహిళలకు చోటు- ఉండడం లేదని తెలిపారు. దీంతో ఈ బోర్డుల్లో ఇద్దరు ముస్లిం మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదిలో జరగనున్నాయని.. ఆ రాష్ట్రంలో 17 శాతం మైనార్టీల ఓట్లు- ఉన్నాయి. అందుకోసమే ఈ బిల్లును తీసుకు వస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ సభ్యులు గౌరవ్ గోగోయ్ మాట్లాడుతూ.. ఈ బిల్లుపై తప్పు దొవ పట్టించే ప్రయత్నాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతేకాకుండా.. ఈ బిల్లు సవరణలు సమర్పించడానికి ఒక ఏడాది ముందు, 2023లో జరిగిన పార్లమెంటరీ కమిటీ- నాలుగు సమావేశాలు జరిగాయని.. వాటిలో దేనిలోనూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ బిల్లును ఎందుకు ప్రస్తావించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని రంజన్ గొగోయ్ సూటిగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పై విధంగా స్పందించారు.

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సహకరించండి

సీఐఐ సమావేశాలు నిర్వహించడం, ఇంజినీరింగ్ కాలేజీలు నెలకొల్పడం, మైక్రోసాఫ్ట్ సహా ప్రముఖ కంపెనీలు ఏర్పాటయ్యేలా చూడటంతో హైదరాబాద్ దశ-దిశ మారిపోయిందన్నారు. నాడు హైదరాబాద్‌ను ఐటీ- హబ్ చేసినట్టు-గానే, ఇప్పుడు అమరావతిని క్వాంటమ్ వ్యాలీ చేయాలనేది తన సంకల్పంగా చెప్పారు. అలాగే 'వన్ ఫ్యామిలీ - వన్ ఐటీ-ప్రొఫెషనల్' అని గతంలో తాను చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇచ్చాయని గుర్తు చేశారు. భారతీయులు ఎక్కడ ఉన్నా ఆయా ప్రాంతాలను, అక్కడ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ప్రతిభతో రాణిస్తున్నారని అన్నారు. దూరం అనేది ప్రపంచంలో ఒక సమస్య కాదన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు అడుగులు వేశామన్నారు. గతంలో తమ ప్రభుత్వం పీ3 కార్యక్రమాన్ని చేపట్టిందని దాంతో కొన్ని కుటు-ంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని... ఈసారి జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు- ముఖ్యమంత్రి చెప్పారు. సమాజంలో ఉన్నత వర్గాలు, అట్టడుగున ఉన్న పేదలకు అండగా నిలవడమేనని అన్నారు. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి వారు ఇతరుల సహాయంతోనే పైకి వచ్చారని ముఖ్యమంత్రి వివరించారు. మీరందరూ కూడా సమాజంలో సమానతల కోసం, పేదరిక నిర్మూలనకు కదిలిరావాలని, అందరూ పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. 'వన్ ఫ్యామిలి-వన్ ఎంటప్రెన్యూర్', జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాలు ఎంతో ఉన్నతమైనవని... ముఖ్యమంత్రి ఆశయంపై సమావేశానికి హాజరైన పలువురు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వచ్చే ఏడాది కల్లా అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ ఏర్పాటు- చేసి ఫస్ట్ బ్యాచ్ అడ్మిషన్లు చేపడతామని బిట్స్ పిలానీ వైస్ చాన్సలర్ వి.రామగోపాలరావు, అలాగే అమరావతి క్వాంటమ్ వ్యాలీలో కూడా తాము భాగస్వామి కావాలనుకుంటు-న్నామని చెప్పారు. విశాఖపట్నంలో జీఎంఆర్ ఐటీ- ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జీఎంఆర్ సంస్థల అధినేత జీఎంఆర్ అన్నారు. వచ్చే ఐదేళ్లలో 20,000 స్టార్టప్‌లు ఏర్పాటు అయ్యేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీంతో లక్ష మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు వస్తాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతి ఉంటుంది. దీనికి  గ్రూపు లీడర్‌గా టాటా గ్రూపు ఉంటుంది. ఎల్ అండ్ టీ-, ఎఎంఎన్ఎస్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయి. అమరావతి హబ్‌కు రాష్ట్రంలో 5 స్పోక్స్ అనుబంధంగా ఉంటాయి.

## కొడాలి నానికి బైపాస్ సర్జరీ

ముంబై : గత కొద్దిరోజుల నుంచి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానికి గుడె ఆపరేషన్ జరిగింది. ఆయన గుండె ఆపరేషన్ చేయించుకోవడానికి ముంబైకి వెళ్లారు. ముంబైలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్‌లో చేరారు. అక్కడి వైద్యులు తాజాగా కొడాలి నానికి బైపాస్ సర్జరీ చేశారు. సర్జరీ విజయవంతం అయింది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. మరికొన్ని రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది. కొద్దిరోజుల క్రితం కొడాలి నాని తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఆయన్ను పరీక్షించిన వైద్యులు గుండెకు సంబంధించిన సమస్య వచ్చినట్లు- గుర్తించారు. ఆయన గుండెల్లో మూడు వాల్వ్ పూడుకు పోయినట్లు- తెలుస్తోంది. గత ఐదు రోజుల నుంచి ఆయన అక్కడే చికిత్స పొందుతున్నారు. తాజాగా, కొడాలి నానిని హైదరాబాద్ నుంచి ముంబై తీసుకెళ్లారు. ప్రత్యేక విమానంలో ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో ముంబై తీసుకెళ్లారు.అక్కడి ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్‌లో సర్జరీ జరిగింది.

## తెలంగాణలో ఎల్‌ఆర్ఎస్ గడువు పెంపు

ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్‌ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్‌ఆర్ఎస్ పక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. అలాగే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీ-ల పరిధిలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు 15.27 లక్షలు వచ్చాయి. వాటిలో 15,894 దరఖాస్తులను ప్రభుత్వాధికారులు తిరస్కరించారు. ఇక ప్రాసెస్ అయిన ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు 6. 87లక్షలు కాగా.. ఎల్‌ఆర్ఎస్ ఫీజు రూ. 8.65 లక్షలు పెండింగ్‌లో ఉంది. వీటితో పాటు- ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు 2.6 లక్షలు కాగా.. వాటికి సంబంధించి ప్రొసీడింగ్ ఇచ్చిన ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు 58, 032 ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ వివరాలను వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందు పరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు.. బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది. అలాగే ఎల్‌ఆర్ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటు-లోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్ సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. అలాగే వెబ్ సైట్ పోర్టల్‌లోని అంశాలపై ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అదీకాక ఎల్‌ఆర్ఎస్ గడవు సమీపిస్తున్నా.. ప్రభుత్వం ఎటు-వంటి చర్యలు తీసుకోలేదంటూ పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. అలాంటి వేళ.. ఎల్‌ఆర్ఎస్ ఫీజు గడువును మరో నెల రోజులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసింది.

## మెదక్ జిల్లా ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన నేతలు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## తక్కువకాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత

### భూముల కాపాడటంలో బీఆర్ఎస్ ఎంతో శ్రమించింది
### రేవంత్‌కు పాలన చేతకావడం లేదు : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : సీఎం రేవంత్ పాలన ఎవరికి అర్థం కావడం లేదని.. ఇంత తక్కువ కాలంలో ప్రజావ్యతిరేకత కూడగట్టుకున్న సీఎం ఆయనే అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో ఉన్నారని  కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దుశ్చర్య వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయింది కాబట్టి 400 ఎకరాల భూమిని విక్రయించాలని నిర్ణయించారు అని ఆమె అన్నారు. బుధవారం ఆమె మీడియాలో మాట్లాడుతూ హైదరాబాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా 400 ఎకరాల భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని ఆమె పేర్కొన్నారు. ఆ భూముల పరిరక్షణ కోసం కేసీఆర్ నిర్దేశం మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారన్నారు. ఇది యూనివర్సిటీ భూమి అని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళవద్దన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందని గుర్తుచేశారు. యూనివర్సిటీ నుంచి తీసుకున్న భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 397 ఎకరాలను ఇతర చోట యూనివర్సిటీకి ఇచ్చామని ప్రభుత్వం వితండవాదం చేస్తుందని మండిపడ్డారు. పరిశ్రమల ఏర్పాటు, భూముల విక్రయం ఆ 397 ఎకరాల్లో చేసుకోవచ్చు కదా..? ప్రభుత్వం పర్యావరణం, ప్రకృతి కోణంలో కూడా ఆలోచించాలి అని కవిత సూచించారు. ఇప్పటికే కాంక్రీట్ జంగిల్ లాగా మారిన గచ్చిబౌలి ప్రాంతంలో ఈ 400 ఎకరాల్లో కూడా పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటు అయితే వాతావరణంపై ఎంత ఒత్తిడి పెరుగుతుందో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో మై హోమ్ విహంగ నిర్మాణానికి భూములు కేటాయించామనడంలో వాస్తవం లేదన్నారు. మై హోమ్ విహంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లయితే సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లను పంపించాలని అన్నారు.

# శాంతి చర్చలకు మేము సిద్ధమే

## మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్



గంగుల రాంగోపాల్ (బ్యూరో చీఫ్) : హైదరాబాద్, ఏప్రిల్ 2: 'మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధం ఆపి, బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలనే అంశంపై గతనెల 24న హైదరాబాద్ లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసిన శాంతి చర్చల రౌండ్ టేబుల్ సమావేశం స్వాగతిస్తున్నామని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విలేఖరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 జనవరిలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం, విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 'కగార్' పేరుతో విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల ప్రజలపై ప్రతిఘాతక యుద్ధాన్ని ప్రారంభించి ప్రజల్ని మోసగించడాని కి ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి / హోంమంత్రి విజయ్ శర్మ మావోయిస్టులతో చర్చలు జరపడానికి సిద్ధమేనని, మావోయిస్టులు చర్చలకు రావాలి' అని పదే పదే ప్రకటనలు చేశారని, అందుకు మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి వికల్ప్ రెండు సార్లు శాంతి చర్చలకు సిద్ధమేనని పేర్కొన్నారని గుర్తు చేశారు. శాంతి చర్చలకు సానుకూల వాతావరణ%శీ% ఏర్పాటు చేయడం కోసం, 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్ లకే పరిమితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంప్ ల ఏర్పాటును నిలిపి వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేసారని ఆ ప్రతిపాదనకు స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా "మావో" ప్రభావిత రాష్ట్రాలన్నింటా, ముఖ్యంగా ఛత్తీస్ గఢ్ లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ఈ యుద్ధంలో దేశ వ్యాప్తంగా 400కు పైగా "మావో" నాయకులను, కార్యకర్తలను, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయిల కమాండర్లను, సభ్యులను, సాధారణ ఆదివాసీ ప్రజానీకాన్ని హత్య చేసాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు అనేక మంది అరెస్ట్ చేసి అక్రమ కేసులు నమోదు చేయించి జైళ్ల పాల్జేస్తున్నాయని ఆయన ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారమే సాధారణ ప్రజానీకాన్ని హత్య చేస్తున్నాయని, చుట్టివేసి చంపివేసే (కార్టన్ అండ్ కిల్) ఆపరేషన్లలో చిక్కుకుంటున్న పీ.ఎల్.జీ.ఏ.కు చెందిన నిరాయుధ సభ్యులను, గాయపడి సాయుధ బలగాలకు చిక్కిన సభ్యులను అమానవీయ చిత్రహింసలకు గురిచేసి హత్య చేస్తున్నాయన్నారు. మహిళలపై సామూహిక అత్యాచారాలు చేసి హత్య చేస్తునందున యుద్ధాన్ని నరసంహారం(జీనోసైడ్) అని, ఈ యుద్ధంలో కేంద్ర ప్రభుత్వం కమాండో బలగాల ముసుగులో భారత సైన్యాన్ని మోహరించిందని, విప్లవోద్యమ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించకుండానే అంతర్గత భద్రత కోసం సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగ వ్యతిరేకం. కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి గానీ, ప్రకటించక గానీ స్వంత దేశ ప్రజలపై సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగపు మౌలిక భావనలకే వ్యతిరేకం. సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీ, పీడనలను సుస్థిరం చేయడం కోసమే, 'హిందూ రాష్ట్ర ఏర్పాటు కోసమే బీజేపీ పాలిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ఇతర రాజకీయ పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించ తలపెట్టిన 'వికసిత్ భారత్-హిందూరాష్ట్ర' ఎలా ఉంటుందనేది కగార్ యుద్ధం ద్వారా స్పష్టమవుతోంది. అది ఆదివాసుల,పేదల రక్తపుమడుగుల పునాదులపై నిర్మాణమవుతోంది. అది రేపు దేశంలోని రైతాంగపు భూముల్ని, ప్రాకృతిక వనరులను, మార్కెట్ ను, ప్రభుత్వ రంగ సంస్థలను దేశ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెడుతుంది. మతమైనారిటీలపై వివక్షతను రాజ్యాంగబద్ధం చేస్తుంది. సమాఖ్య వ్యవస్థను నాశనం చేసి నియంతృత్వ కేంద్ర ప్రభుత్వాన్ని (ఆటోక్రటిక్ యూనిటరీ స్టేట్ ను) నిర్మిస్తుంది. తూర్పు, మధ్యభారతంలో మా పార్టీ నాయకత్వంలో ఆదివాసులు, వారితోపాటు తరతరాలుగా నివాసముంటున్న గైరాదివాసీ పేద ప్రజానీకం తమ జల్, జంగల్, జమీన్ పై అధికారం కోసం, స్వయంపాలన (అటానమి) కోసం. తమ సంస్కృతి - సాంప్రదాయాల రక్షణ కోసం, తమ మాతృ భాషల రక్షణ కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం మొత్తంగా సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను కూలదోసి సమసమాజ స్థాపన కోసం పోరాడుతుంటే బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రజాపోరాటాలను నిర్మూలించడం కోసం తూర్పు, మధ్యభారతంలో కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నా యని, సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీ, పీడనల నుండి దేశంలోని పీడిత ప్రజల, పీడిత సాంఘిక సముదాయాల, పీడితజాతుల విముక్తి కోసం పోరాడుతుంటే ఆ పోరాటాలను అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయుధ పోలీసు బలగాల్ని, ఎన్ఐఏ లాంటి ఇంటలిజెన్స్ ఏజెన్సీ ఉపయోగించి పోరాడే వారిపై దాడులు చేస్తున్నా యన్నారు. ప్రజాపక్ష మేధావులపై భీమాకోరేగావ్ కుట్ర కేసును మోపి జైళ్లో బంధించాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే, దేశంలోని సకల పీడిత ప్రజలపై, పీడిత సాంఘిక సముదాయాలపై, పీడిత జాతులపై సామ్రాజ్యవాదులు, దళారీ పెట్టుబడిదార్లు, భూస్వాములు సాగించే దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా మా పార్టీ పోరాడుతుంటే, ఈ దోపిడీ పాలకవర్గాల దోపిడీ, పీడనలను సుస్థిరం చేయడానికి బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రజలపై కగార్ పేరుతో యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. విప్లవోద్యమ ప్రాంతాల్లో ఆదివాసీ యువతి- యువకులను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకుని వారిచేతనే ఆది వాసులను హత్యలు చేయిస్తున్నా యన్నారు. ఈ స్థితిలో ప్రజల ప్రయోజనాల కోసం మేము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే. అందుకే శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదన పెట్టామని పేర్కొన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలీ), ఒడిశా, ఝార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యకాండలను, నరసంహారాన్ని (జీనోసైడ్) ను నిలిపివేయాలని,సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపి వేయాలని ప్రతిపాదిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తే తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తామని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనల ఆధారంగా శాంతి చర్చలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకరావాలని శాంతి చర్చల కమిటీకి,దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు, ఆదివాసీ, దళిత సంఘాలకు, విద్యార్థి- యువజనులకు, పర్యావరణ కార్యకర్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు. శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, నగరాల్లో, జిల్లా,తాలూకా కేంద్రాల్లో, యూనివర్సిటీల్లో ప్రచార క్యాంపెయి న్ ను చేపట్టాల్సిందిగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదల చేసిన ప్రకటనలో పిలుపును ఇచ్చారు.

# జంతు సంరక్షణ సామాజిక బాధ్యత..

### జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం అమలు

### మూగజీవాలపై మానవతా స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

### డీఎస్‌పీసీఏ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ : జంతు సంరక్షణ అనేది సామాజిక బాధ్యత అని, జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ?కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన బుధవారం జంతువులపై క్రూరత్వ నివారణ జిల్లా సొసైటీ సర్వసభ్య సమావేశం వర్చువల్‌గా జరిగింది. తొలుత జిల్లా సొసైటీ-లో ప్రగతిశీల రైతులు ఎ.శ్రీపద్మ, వి.రవికుమార్‌ల సభ్యత్వానికి సమావేశం ఆమోదం తెలిపింది. అనంతరం జిల్లా పరిధిలో జంతు సంరక్షణకు తీసుకుంటు-న్న చర్యలు, వేసవి కార్యాచరణ, వీధి కుక్కలు-జనన నియంత్రణ కార్యక్రమం అమలు, యాంటీ- ర్యాబిస్ వ్యాక్సినేషన్ తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జంతువులపై క్రూరత్వ నివారణ జిల్లా సొసైటీ-సభ్యుల సమష్టి కృషితో జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం పటిష్ట అమలుకు కృషిచేయడం జరుగుతోందన్నారు. విజయవాడ నుంచి 10-15 కి.మీ.లోపు జిల్లా ఎస్‌పీసీఏ యానిమల్ షెల్టర్ (గోశా) ఏర్పాటు-కు ఎకరా స్థలాన్ని గుర్తించాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు- తెలిపారు. వేసవి నేపథ్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహాయంతో అన్ని ఆవాసాల్లోనూ నీటి తొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు-తెలిపారు. ఇప్పటికే ఉన్నవాటికి ఏవైనా మరమ్మతులు అవసరమైతే యుద్ధప్రాతిపదికన చేసి, వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీరాజ్, డ్వామా, పశు సంవర్థక శాఖల అధికారులను ఆదేశించారు. భారత జంతు సంక్షేమ బోర్డు (ఏడబ్ల్యూబీఐ) మార్గదర్శకాలు, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్-2023 ప్రకారం జిల్లాలో వీధి కుక్కల సంతాన నియంత్రణ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. నెలకు సగటు-న 1,100 ఏబీసీ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 211 కెన్నెళ్లు అందుబాటు-లో ఉన్నాయని, మరో 100 కెన్నెళ్ల నిర్మాణం పూర్తయి వినియోగానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జంతు సంరక్షణపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను కొనసాగించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్థక అధికారి డా. ఎం.హనుమంతరావు, జెడ్‌పీ సీఈవో కె.కన్నమ నాయుడు, డీపీవో పి.లావణ్య కుమారి, డీఈవో యూవీ సుబ్బారావు, నాన్ అఫీషియల్ వైస్ ప్రెసిడెంట్ పాకూరి బాలకృష్ణ, సొసైటీ- సభ్యులు గోవింద సాబూ, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

# రియల్ ఎస్టేట్ కోసమే సెంట్రల్ వర్సిటీ భూములు

### కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బిఆర్ఎస్ ఫిర్యాదు

### భూములను కాపాడాలన్న ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్

### ఢిల్లీ పెద్దలకు కప్పం కోసమేనని ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపణ

న్యూఢిల్లీ/హైదరాబాద్ : రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసం సెంట్రల్ యూనివర్సిటీని సీఎం రేవంత్‌రెడ్డి విధ్వంసం చేస్తున్నాడని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీఆర్ఎస్‌వీ, హెచ్‌సీయూ విద్యార్థులతో పాటు ఎమ్మెల్సీ కలిశారు. భూములను కాపాడాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు కేంద్రమంత్రిని కలిశామన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. మానవత్వం లేకుండా కర్కషత్వంతో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ-లో 400 ఎకరాలను విధ్వంసం చేస్తున్నారని.. రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసం యూనివర్సిటీ-ని విధ్వంసం చేస్తున్నారన్నారు. భూములను కాపాడుతామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని.. భారత జాతీయ పక్షి నెమళ్లు కాపాడాలని ఘోషిస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో హెచ్‌సీయూ భూములు గెలవగానే.. వాటిని తాకట్టు-పెట్టి రూ.20వేలకోట్ల అప్పు తెచ్చారని.. శత్రుదేశాలపై యుద్ధం చేసినట్లు- హెచ్‌సీయూపై సీఎం, రాష్ట్ర ప్రభుత్వం దాడి చేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ నీచంగా వ్యవహరిస్తున్నారని.. ఒక జింకను చంపితే ఐదేళ్ల శిక్ష సల్మాన్ ఖాన్‌కు పడితే.. వందల నెమళ్లు.. జింకలను చంపుతున్న రేవంత్‌రెడ్డికి ఎన్నేళ్ల శిక్ష పడాలని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ లా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని.. యూనివర్సిటీ- విధ్వంసంపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి రాజ్యంలో నోరులేని మృగాలు, పేదలు బతకొద్దా? అంటూ నిలదీశారు. ఇదిలావుంటే ఢిల్లీ బాసుల జేబులు నింపేందుకు.. గల్లీలో భూములను తెగనమ్ముతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగినట్లుగా సెంట్రల్ యూనివర్సిటీలోనూ లాఠీఛార్జ్ జరుగుతుందని మండిపడ్డారు. విద్యార్థులను గదుల్లోకి వెళ్లి లాక్కొచ్చి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ-లో ఒక్క తెలంగాణలే లేరని.. దేశ నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి చదువుకుంటు-న్నారని.. విద్యార్థులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. భట్టి, శ్రీధర్‌బాబు సెంట్రల్ యూనివర్సిటీ లోనే చదివారని.. సెంట్రల్ యూనివర్సిటీపై భట్టి, శ్రీధర్ బాబుకు ప్రేమ లేదా? అని నిలదీశారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని తిట్టడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎజెండా లేదని విమర్శించారు. ఢిల్లీ బాసుల జేబులు నింపేందుకే గల్లీలో భూములు అమ్ముతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం, పీసీసీ, మంత్రి పదవులు, ఎమ్మెల్యే కావాలంటే పేమెంట్ ఇవ్వాల్సిందేనని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఇందిరమ్మను అవమానించారని.. తెలంగాణ, ఆంధ్రా ఉద్యమంలో ఇందిరా గాంధీ సెంట్రల్ యూనివర్సిటీ- స్థాపించారని.. సెంట్రల్ యూనివర్సిటీలో ఇందిరాగాంధీ నాటిన మొక్కను తీసిన కలుపు మొక్కలు మీరు అంటూ ధ్వజమెత్తారు. 400 ఎకరాల భూమిని వేలం వేసే విధంగా ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. దామగుండంలో అడవులను మొత్తం నరికారని.. అంబేద్కర్ యూనివర్సిటీ భూములను కొల్లగొట్టాలని చూస్తున్నారన్నారు. హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం కన్నుపడిందని.. నాటి చంద్రబాబు.. నేటి రేవంత్ రెడ్డి పాలనకు తేడా లేదన్నారు.

# ప్రజా సమస్యలపై మండలిలో గళమెత్తాం

### మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

గుంటూరు : ఎమ్మెల్సీగా ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి పోరాడతామని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలపై శాసనమండలిలో రాజీలేని పోరాటం చేసి ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. రాజ్యాంగ విలువలకు, లౌకికవాద విధానాలకు కట్టుబడి నిజాయితీ, నిబద్ధతతో పనిచేశామని బుధవారం నాడిక్కడ తెలిపారు. ఎమ్మెల్సీగా కెఎస్.లక్ష్మణరావు మూడుసార్లు గెలుపొందారు. 2007, 2009లో కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి, 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. తాజాగా ఆయన పదవీ కాలం మార్చి 29తో ముగిసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2007లో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పిడిఎఫ్ తరఫున ఎమ్మెల్సీలు ఏడుగురం గెలుపొందాం. మేమంతా కలిసి సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజాసమస్యలపై ఉమ్మడిగా శాసనమండలిలో పలు అంశాలను లేవనెత్తేందుకు ఒక బృందంగా ఏర్పడ్డార. దీనికి ప్రొగ్రెసివ్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ (పిడిఎఫ్) అనే పేరు పెట్టాం. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, పేదల అభ్యున్నతి కోసం పనిచేయాలని నిర్ణయించార. ఇదే పద్ధతిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పనిచేస్తున్నారు ప్రజా సమస్యలపై సభలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాం. బయట ఉద్యమాలు చేసే ప్రజా సంఘాలకు సంపూర్ణ మద్ధతు ఇస్తూ వచ్చాం అని వివరించారు.

# ఇంటర్ కాలేజీలకు జూన్ 1 వరకు సెలవులు

హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ కళాశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. ఈ సెలవులు మార్చి 30 నుంచి ప్రారంభమై జూన్ 1, 2025 వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు ఈ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు వేసవి సెలవులను స్వీయ అధ్యయనం, నైపుణ్యాల అభివృద్ధి, ఇతర ప్రయోజనకరమైన కార్యకలాపాలకు వినియోగించుకోవాలని సూచించింది. జూన్ 2నుంచి తరగతులు మళ్లీ ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు వెల్లడించింది. అలాగే, సెలవుల సమయంలో అనధికారికంగా తరగతులను నిర్వహించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# అడవులో వణ్య ప్రాణాలు ఘోష వినపడటం లేదా..?

### హెచ్‌సీయూ ఘటన ఫలితం రేవంత్ అనుభవిస్తాడు

### రేవంత్‌ను జైలులో పెడితే కానీ.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండదు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ : ఎంతమంది మేధావులు, విద్యావంతులు హెచ్చరిస్తున్నా హెచ్‌సీయూ భూములను లాక్కుకుంటున్నారని.. ఇది ఫలితం రేవంత్‌రెడ్డి తప్పక అనుభవిస్తాడని ఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. హెచ్‌సీయూ బయో డైవర్సిటీ పార్క్ విధ్వంసం, భూముల కుంభకోణంలో కాంగ్రెస్ గుంట నక్కల ముఠాపై వెంటనే సుమోటోగా కింది కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్ 29, అటవీ సంరక్షణ చట్టం 1980లోని సెక్షన్ 2, తెలంగాణ వాల్టా చట్టం 2002లోని సెక్షన్ 35 కింద కేసులు నమోదు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, అతనికి సహకరిస్తున్న మంత్రులందరిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి. అప్పుడే తెలంగాణ సురక్షితంగా ఉంటుంది అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఊర్లలో ఎడ్ల బండి మీద ఇల్లు కట్టడానికి వాగు నుండి తట్ట ఇసుకను తీసుకపోతే ఆ బండిని సీజ్ చేసి స్టేషన్‌లో పెట్టే పోలీసులు, రెవెన్యూ అధికారులకు.. అడవిలో వన్యప్రాణుల ఘోష వినిపించడం లేదా..? బుల్డోజర్లు కనిపించడం లేదా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ ఎక్కడ? విద్యార్థులను కిరాయి ఉద్యమకారులన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి రియల్ దందాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ కడుతున్న కట్టడాలను ప్రజలు ఎవరూ కొనకుండా బహిష్కరించాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న ధీరత్వానికి ప్రతీక : కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా కేటీఆర్ నివాళులర్పించారు. రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి ఎనలేనిది అని కొనియాడారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని చాటడానికి ప్రతి ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ పోరాటయోధుడి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను అని పేర్కొన్నారు. జోహార్ సర్వాయి పాపన్న! అని కేటీఆర్ నినదించారు. సబ్బండ వర్గాల సమానత్వానికి పాటుపడిన పాపన్న :హరీశ్‌రావు

బహుజన పోరాట యోధుడు, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాటుపడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘన నివాళులర్పించారు. పాపన్న గౌడ్ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటేలా ప్రతి ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. పాలనలో సబ్బండ వర్గాలను భాగస్వామ్యం చేసి, వేలాది మంది దళిత, బహుజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దింది బీఆర్ఎస్ ప్రభుత్వం. బహుజనుల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మకమైన పథకాలు, కార్యక్రమాలు అమలు చేసి వారి అభ్యున్నతికి పాటు పడింది. పాపన్న గౌడ్ గొప్ప సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ముందుకు సాగుదాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ముస్లింల సంక్షేమానికి వక్ఫ్ ఆస్తులు

### వక్ఫ్ సవరణకు మద్దతు ఇచ్చిన టిడిపి

న్యూఢిల్లీ : వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగం కాకుండా ముస్లింల సంక్షేమానికి వినియోగించాలన్నదే తమ డిమాండ్ అని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో టీడీపీ ఎంపీ కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. వక్ఫ్ కు రూ.1.2 లక్షల కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయని అన్నారు. ఈ ఆస్తులు దుర్వినియోగానికి గురయ్యాయని తెలిపారు. ఈ ఆస్తిని ముస్లింల సంక్షేమం కోసం, మహిళల సంక్షేమం కోసం ఉపయోగించాలని తమ పార్టీ కోరుతోందన్నారు. దీనిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. జేపీసీని డిమాండ్ చేసిన మొదటి పార్టీ తమదే అని పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. 97 లక్షలకు పైగా కమ్యూనికేషన్లు జరిగాయని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ బిల్లు 14 సవరణలతో వచ్చిందని.. తమ పార్టీ మూడు సూచనలు ఇచ్చిందన్నారు. ముస్లింల ప్రయోజనాలను కాపాడే మూడు సూచనలను ఆమోదించారన్నారు. తెలుగుదేశం పార్టీ ముస్లింల సంక్షేమం, అభ్యున్నతికి కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు కూర్పును నిర్ణయించడానికి, నియమాలను రూపొందించ డానికి రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఇవ్వాలని తాము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తాము వక్ఫ్ సవరణ బిల్లును మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు.

## తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలి

### లేఖ విడుదల చేసిన మావోయిస్ట్ కేంద్ర కమిటీ

రాయపూర్ : తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని,కేంద్రంతో శాంతి చర్చలకు మేం సిద్దంగా ఉన్నామని, మావోయిస్ట్ కేంద్ర కమిటీ లేఖ విడుదల చేసింది. దీనిని బట్టి చూస్తే ఇటీవలి వరుస ఎదురుదెబ్బలతో డీలాపడ్డ మావోయిస్టులు ఒక్కసారిగా తమ స్వరం మార్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడే మావోయిస్టులు తాజాగా శాంతి చర్చల అంశాన్ని తెరపైకి తెచ్చారు. కేంద్రంతో చర్చలకు తాము సిద్ధమని ఓ లేఖ విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ- పేరుతో ఈ లేఖ విడుదలైంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ- అధికార ప్రతినిధి అభయ్ కేంద్రానికి ఒక లేఖను విడుదల చేశారు. నక్సల్ ప్రభావిత రాష్ట్రాలైన ఛత్తీస్ ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, మహారాష్ట్రలలో తక్షణమే కేంద్ర బలగాలు కాల్పులను నిలిపివేయాలని ఆ లేఖలో కోరారు. తాము కూడా కాల్పుల విరమణను పాటించి శాంతి చర్చలకు సానుకూల వాతావరణాన్ని కల్పిస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ముందుకొస్తే అందుకు తాము సిద్దంగా ఉన్నామంటూ మావోయిస్టులు ఆ లేఖలో స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ తీరు మార్చుకోవాలి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పయనం అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యంగా ఎపిలో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అక్కడ ఎవరు వచ్చినా ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టం. గత ఎన్నికలకు ముందు షర్మిల పగ్గాలు చేపట్టినా పెద్దగా లాభం లేకుండా పోయింది. చివరకు ఆమె కూడా గెలవలేదు. వైఎస్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో జగన్ సఫలమైనా..పాలనలో విఫలం అయ్యారు. స్వార్థపూరిత రాజకీయాలు జగన్ పతనాన్ని శాసించాయి. ఇప్పుడు షర్మిల పోరాటం వల్ల జగన్‌కు నష్టం జరగిందే తప్ప కాంగ్రెస్‌కు లబ్ది చేకూరలేదు. తెలంగాణలో బిజెపికి దక్కాల్సిన అధికారం అనూహ్యంగా కాంగ్రెస్‌కు దక్కింది. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక చేస్తున్న కార్యక్రమాలు కొంతమేరే ఫలితం ఇచ్చినా, సమర్థ నేతగా రుజువు చేసుకోలేక పోతున్నారు. బహునాయకత్వం, ప్రతిదానికీ హైకామండ్ ముందు మోకరిల్లాల్సి రావడం వంటి కారణాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతోంది. మంత్రులతంతా ఎవరికివారు యమునా తీరే అన్నట్లుగా ఉంటున్నారు. తమ శాఖల పరిధిలోని కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయలేక పోతున్నారు. దేవాయదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ రెండు శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. అడవుల పెంపకం లేదు. కోతులు గ్రామాలను పట్టిపీడిస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల చెరను విడిపించలేకపోతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలకే పరిమితం అయ్యారు. ఎక్కడా రోడ్ల అభివృద్ధి జరగడం లేదు. రాజధాని హైదరాబాద్ అంతర్గత రోడ్లు ఏడాది దాటినా అభివృద్ధిక నోచలేదు. గ్రామాల్లో నిధులు విడుదల కాకపోవడంతో పనులు పడకేశాయి. ఇలా ఒక్కోమంత్రి తీరు ఒక్కోలా ఉంది. శాఖల్లో పనులు సక్రమంగా సాగడం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోదు.. ప్రతిపక్షంలో ఉంటే విపక్షంగా గట్టి పాత్ర నిర్వహించదు. అధికారం కోసం వెంపర్లాడడం తప్ప అణగిమణిగి ఉండాలన్న ఆకాంక్ష కానరాదు. పార్టీని బలోపేతం చేయడం కోసం ఎవరూ పాటుపడరు. పాటుపడేందుకు ఎవరైనా ముందుకు వస్తే కాళ్లు లాగేస్తుంటారు. అధికారం వస్తే పదవుల కోసం పాకులాడుతారు. అధికారం లేకుంటే కీచులాటతో పార్టీని భ్రష్టు పట్టిస్తుంటారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. నాయకత్వాన్ని సహించే లక్షణం లేదు. నాయకుడు ఎవరైనా కాళ్ళల్లో కట్టెలు పెట్టడం అలవాటు. అలా పార్టీకిచేటు జరుగుతున్నా పట్టించుకోరు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే ధోరణి కనిపిస్తోంది. బిఆర్ఎస్, బిజెపిలు చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టలేక పోతున్నారు. హైదరాబాద్ భూముల విషయంలో వీరి వాదన పేలవంగా ఉంది. నిజానికి భూమిని కోర్టులో పోరాడి దక్కించుకుంటే దానిని రక్షించాలి తప్ప ఆమ్మరాదు. సన్నబియ్య, పెన్షన్ల పేరుతో దుబారా చేసే బదులు దుబారాకు కళ్లెం వేయాలి.ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే అధికార కూటమిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది నిజంగా ఆత్మహత్య సదృశ్యమే. ఇలా జాతీయ స్థాయిలోనూ కనిపిస్తాయి. అధికారంలో ఉంటే కళ్లు నెత్తికెక్కుతాయి. పార్టీలో ఎవరైనా పెత్తనం చెలాయిస్తారని భావిస్తే అలాంటి వారిని అసలు చేరకుండా అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. పార్టీపరంగా రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉంటారే తప్ప పరిష్కారనికి ముందుకు రారు. జాతీయస్థాయిలో అయినా.. రాష్ట్రస్థాయిలో అయినా ఇదే పరిస్థితి ఉంటుంది. తాజాగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కూడా ఇందుకు భిన్నం కాదు. రేవంత సిఎంగా ముందుకు నడుస్తున్న వేళ..పటిష్ట నిర్ణయాలపై చర్చించడం లేదు. సమస్యలను చర్చించి పరిష్కరించే చర్యలు కానరావడం లేదు. ఉమ్మడిగా పినచేయడం లేదు. కేవలం రేవంత్ మాత్రమే అందరినీ కలుపుకుని పోయేలా ఉంటున్నారు. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పెద్దగా పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ పరువు పోయినా, ఉన్న వారు బయటకు పోతున్నా.. ఉన్నవారు మాత్రం బింకాన్ని వదలకుండా తమకోసం పోరాడుతారు. తెలంగాణలోని పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా ఈ జాడ్యం పట్టుకుంది. పార్టీలో వ్యతిరేకంగా పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం సీరియ్‌సగా పరిగణించి..రేవంత్ రెడ్డికి పూర్తి అధికారం ఇచ్చి నడిపించడం లేదు. ఎందుకంటే రాజకీయాలు చేయడం అక్కడే మొదల వుతోంది. అధిష్టానం కర్నాటక, తెలంగాణలను పిండేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ భూముల అమ్మకం వెనకా ఒత్తిళ్లు ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ బలహీన పడితే, ఆ పరిస్థితి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే లాభిస్తుంది. కొన్ని రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ ఎదురెదురు నిలిచి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో బీజేపీ బలహీన పడితే కాంగ్రెస్ కొంత లబ్ధి పొందవచ్చు. బీజేపీ ఎంత బలహీనపడినా, కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం అనుమానమే. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బీజేపీకి, కాంగ్రెస్÷-కు సవాలుగా ఉన్నాయి. తమ రాష్ట్రాలలో బీజేపీని, కాంగ్రెస్‌ను ఓడించిన ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికారంలో కొనసాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ గత బిఆర్ఎస్ పాలనకు భిన్నంగా నడుచుకోవాలి. మాటలు, పదేపదే విమర్శలు కట్టిపెట్టి ప్రజల కోం అంతా కలసి పనిచేయాలి. హైదరాబాద్ భూముల వివాదాన్ని పక్కన పెట్టాలి. వాటిని అమ్మాలన్న ఆలోచనను పక్కకు పెట్టాలి. అందుకు ప్రత్యమ్నాయంగా ఉచిత పథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే పార్టీకి ఆదరణ పెరుగుతుంది. పార్టీని, ప్రభుత్వాన్ని ఇలాగే కొనసాగిస్తే కాంగ్రెస్ గత చరిత్ర పునరావృతం కాగలదు.

# ఔదార్యంలో రతన్ టాటా టాప్



### ఆస్తిని అందరికి పంచిన తీరు అభినందనీయం

### వీలునామాలో ప్రకటించిన తీరుపై సర్వత్రా చర్చ

న్యూఢిల్లీ : భారత దేశం ఉన్నంత కాలం రతన్ టాటా పేరు చిరస్మరణీయంగా ఉంటుంది. అంతటి సేవా గుణానికి ప్రతీక ఆయన అని వేరుగా చెప్పనక్కరలేదు. బతికుండగానే దేశం కోసం ఎన్నో త్యాగాలను చేశారు. ఎంతో సేవ చేశారు. దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందేందుకు అనేక చర్యలు తీసుకున్న పారిశ్రామికవేత్తగా పేరు గడించారు. గతేడాది చనిపోయిన రతన్ టాటా ఔదార్యం మరోసారి వెల్లడైంది. తన వీలునామాలో రూ. 3800 కోట్ల ఆస్తిని దాతృత్వానికి ఇచ్చారు. ఆస్తుల్లో సింహభాగాన్ని ఛారిటీలకు కేటాయించారు. మిగిలిన దానిని కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉద్యోగులు, జంతువుకు చెందేలా వీలునామా రాశారు. రతన్ టాటాకు రూ. 10 వేల కోట్ల ఆస్తులు ఉండగా, రూ. 3800 కోట్లను దానధర్మాలకే వినియోగించారు. రతన్ టాటా గతేడాది అక్టోబర్ 9 మరణించారు. ఆయన వీలునామా తాజాగా వెలుగులోకి వచ్చింది. తన ఆస్తిలో చాలా ఎక్కువ భాగాన్ని రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్ట్‌లకు కేటాయించారు. షేర్లు, ఇతర పెట్టుబడులు, ఆస్తులు దాతృత్వానికే చెందుతాయని వీలునామాలో పేర్కొన్నారు. బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు-, స్టాక్స్ మొత్తం రూ. 800 కోట్లలో మూడోవంతును తన సవతి తల్లి కుమార్తెలైన షరీన్ జేజీబాయి, డియాన్నా జేజీబాయికి రాశారు. రూ. 800 కోట్లలో మూడో వంతును టాటా మాజీ ఉద్యోగి, అత్యంత ఆప్తుడైన మోహిని ఎం దత్తాకు ఇచ్చారు.తన ప్రాణ స్నేహితుడైన మోహ్లీ మిస్త్రీక్రి అలీబాగ్‌లో ఇంటిని, మూడు తుపాకులను ఇచ్చారు. తన పెంపుడు జంతువుల కోసం ఆయన రూ. 12 లక్షలు కేటాయించారు. తన వద్ద ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా పనిచేసిన శంతను నాయుడికి ఇచ్చిన ఎడ్యుకేషన్ లోన్‌ని మాఫీ చేశారు. పొరుగింటి వ్యక్తి జేక్ మాలైట్ కు ఇచ్చిన వడ్డీ లేని రుణాన్ని మాఫీ చేశారు. ఇదిలా ఉంటే తన వద్ద పనిచేసని వంటవాడిని కూడా రతన్ టాటా మరిచిపోలేదు. తనకు ఎప్పటి నుంచో వండిపెడుతున్న కుక్ రజన్ షాకు రూ. 1 కోటి ఇచ్చాడు. ఇంటి పనులు చేసే సుబ్బయ్యకు రూ. 66 లక్షలు, సెక్రటరీ డెల్నాజ్‌కి రూ. 10 లక్షలు ఇవ్వాలని వీలునామాలో పేర్కొన్నాడు. ఇప్పుడా వీలునామపై సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఆయన ఔదార్యాన్ని శ్లాఘిస్తున్నారు.

## దయచేసి ఆ భూములను కాపాడండి

### సిఎం రేవంత్‌కు రేణూదేశాయ్ వినతి

హైదరాబాద్ : కేంద్రీయ విశ్వవిద్యాలయం సమీపంలోని 400 ఎకరాల భూములపై హెచ్‌సీయూ, తెలంగాణ ప్రభుత్వం మధ్య వివాదం రోజు రోజుకు ముదురుతోంది. ఆ భూముల్లో ఎన్నో వన్యప్రాణులు జీవిస్తున్నాయి. అక్కడి భూమిలోని చెట్ల నరికివేతను ఆపాలని విద్యార్థులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అలాగే మరోవైపు జంతువులు, పర్యవరణానికి ప్రమాదం తేవద్దంటూ పలువురు టాలీవుడ్ సెలబ్రెటీ-లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులకు మద్దతు తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ లు చేస్తున్నారు. తాజాగా ఈ వివాదంపై సినీనటి రేణుదేశాయ్ స్పందిస్తూ ’ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వకంగా చేస్తున్న ఓ విన్నపం. నాకు రెండు రోజుల క్రితం ఐఈ÷ఖ భూముల వ్యవహారం గురించి తెలిసింది. అందుకు సంబంధించి కొన్ని విషయాలు కనుకున్నాను. రేవంత్ రెడ్డి గారు మీకు ఒక తల్లిగా రిక్వెస్ట్ చేస్తున్నాను, నాకు ఇప్పుడు 44సంవత్సరాలు రేపో మాపో చనిపోతాను. కానీ నా పిల్లలు అలాగే మన అందరి పిల్లలకు ఆక్సిజన్ అలాగే త్రాగునీరు కావాలి. అవును మాకు అభివృద్ధి కూడా కావలి, మాకు ఐటి పార్క్, భారీ భవనాలు, వరల్డ్ క్లాస్ సదుపాయాలు కావాలి. కానీ ఈ 400 ఎకరాల ప్రకృతిని, ఫారెస్ట్ ను ధ్వసం చేయకుండా ఆపడానికి మీకు ఏదైనా అవకాశం ఉంటే వెంటనే ఆపేయండి. మీరు పరిపాలిస్తున్నఈ రాష్ట్ర సిటిజన్‌గా అడుగుతున్న ఎదో ఒకటి చేయండి. మన దగ్గర ఎన్నో ఇతర భూములు ఉన్నాయి. మీరందరు నాకంటే ఏంతో సీనియార్స్. మీకు నాకంటే ఏంతో అనుభవం ఉంది. ఒక తల్లిగా రిక్వెస్ట్ చేస్తున్నాను. ఇందులో నా స్వార్థం లేదు. ప్లీజ్ ఒకసారి ఆలోచించండి. గతంలో జరిగిన అబివృద్ధి వలనే ఈ రోజు మనం ఇక్కడ ఉన్నాం. కానీ ఆ 400 ఎకరాలు దయచేసి వదిలేయండి. ఒక తల్లిగా అభ్యర్థిస్తున్నాను సదరు అధికారులు ఈ విషయంలో మరోసారి ఆలోచించండి. ఈ నిర్ణయాన్నివెనక్కి తీసుకుంటే మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను’ అని విన్నవిస్తూ రేణుదేశాయ్ వీడియో రిలీజ్ చేసారు.

## 2న ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవం

విజయవాడ : ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2 వ తేదీన ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. 2008 నుంచి దీనిని ఆచరిస్తున్నారు. ఆటిజమ్ పై 18 డిసెంబర్ 2007 న ఆమోదించిన ఒక తీర్మానం ద్వారా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. ఈ వ్యాధితో బాధపడే పెద్దలు,ప్రత్యేక అవసరాలు గల పిల్లల జీవితాలను మెరుగుపరచి, వారికి తోడ్పాటును అందించడం కోసం ఈ తీర్మానాన్ని ఆమోదించారు. ఆటిజమ్ అంటే.. కొందరు పిల్లలు ఎవరితోనూ కలవకపోవటం, ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతుండటం, సరిగా మాట్లాడలేకపోతుండటం వంటి భిన్న లక్షణాలను కలిగి ఉంటే వారికి ఆటిజమ్ ఉన్నట్టు. ఆటిజమ్ భిన్న విభాగాలకు విస్తరించిన ఎదుగల సమస్య. దీన్నే పర్వేసివ్ డెవలప్‌మెంటల్ డిజార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కనబడతాయి. కొన్ని అంశాల్లో ఎదుగుదల అస్తవ్యస్త మవుతుంది.గుర్తించేదెలా. మరీ చిన్నవయసులో.. అకారణంగా నిరంతరంగా ఏడ్వటం గంటల తరబడి స్తబ్దుగా ఉండటం.. తల్లి దగ్గరకు తీసుకుంటున్నా పెద్దగా స్పందించకపోవటం.. పరిచిత వ్యక్తులను చూడగానే నవ్వక పోవటం? తల్లిదండ్రులు రమ్మని చేతులు చాచగానే ఉత్సాహంగా ముందుకు రావాల్సిన పిల్లల్లో అలాంటి స్పందనలేవీ కనిపించకపోవటంకాస్త పెద్దవయసులో..? మిగతా పిల్లలతో కలవకపోవటం పిలిస్తే పలకకపోతుండటం.. పెరిగే కొద్దీ ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడుతుండటం..మనుషుల కంటే బొమ్మలు, వస్తువుల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండటం ఎవరైనా పలకరించినా వెంటనే సమాధానం ఇవ్వకపోవటం? కళ్లలో కళ్లు పెట్టి చూడకపోతుండటం.. ముఖంలో భావోద్వేగాలేవీ చూపించకపోతుండటం స్పీచ్ థెరపీ, లాంగ్వేజ్ స్టిమ్యులేషన్:? ఒక పద్ధతి ప్రకారం ఉదయం నుంచి రాత్రి వరకూ పిల్లలతో మాట్లాడుతుండటం, సంభాషణా సామర్థ్యం పెరిగేలా చూడటం అవసరం. దీనికి స్పీచ్ థెరపీ దోహదం చేస్తుంది. కళ్లలో కళ్లు పెట్టి చూడటాన్ని అలవాటు చేసేందుకు శిక్షణ, అలాగే మలమూత్ర విసర్జన కోసం టాయ్ లెట్ ట్రైనింగ్ వంటివన్నీ పద్ధతి ప్రకారం నేర్పిస్తారు. క్రమేపీ స్థాయులను పెంచుకుంటూ వెళతారు. దీంతో మెదడులో లోపం క్రమేపీ సర్దుకుంటుంటుంది.

## ప్రొఫెసర్లపై లాఠీచార్జీ బాధాకరం

హైదరాబాద్ : విద్యావంతులైన ప్రొఫెసర్ల లాఠీచార్జీ చేయడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గత నాలుగు రోజుల నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయం శాంతియుతంగా నిరసన చేపట్టిన ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని రేవంత్ రెడ్డి సోకాల్డ్ ప్రజాపాలన తలపిస్తుందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పచ్చని అడవిని నాశనం చేయొద్దని శాంతియుతంగా నిరసనకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. రేవంత్ సర్కార్ వల్ల ఏ వర్గం ప్రశాంతంగా లేదని విమర్శించారు. మొన్నటి నుంచి మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్.. ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూముల రక్షణకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## అమీన్‌పూర్ పిల్లల మృతి కేసును ఛేదించిన పోలీసులు

**వివాహేతర మోజులో పడి పిల్లలు, భర్తను చంపాలని కుట్ర**

**పెరుగు అన్నం తినకపోవడంతో బయటపడ్డ భర్త**

**విచారణలో విస్తుపోయే నిజాలు**


హైదరాబాద్ : వివాహేతర సంబంధాల కోసమే ఎంతకైనా తెగిస్తున్నారు. కట్టుకున్న భర్త, కన్న పిల్లలను సైతం చంపటానికి వెనుకాడటం లేదు. ఈ నేపథ్యంలోనే అమీన్‌పూర్ పిల్లల మృతి కేసును పోలీసులు చేధించారు. ముగ్గురు పిల్లల మృతి కేసులో తల్లే విలన్ అని గుర్తించారు. విషం పెట్టి కడుపున పుట్టిన ముగ్గురు పిల్లలను తల్లే పాశవికంగా అంతమొందించినట్లు తేల్చారు. వివాహేతర సంబంధం మోజులో ముగ్గురు పిల్లలను హత్య చేసిందని నిర్ధారించారు. గత నెల 27న పిల్లలకు పెరుగన్నంలో విషం పెట్టిందని.. తాను కూడా భోజనం చేసి అస్వస్థతకు గురైనట్టు నాటకం ఆడిందని పోలీసులు తేల్చారు. విచారణలో నిజం బయటపడటంతో తల్లి రజితను అరెస్ట్ చేశారు. భర్తను కూడా చంపాలని ఆమె డిసైడయ్యింది. అయితే అతను పెరుగన్నం తినకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. హైదరాబాద్ శివారు అమీన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన చాలా సంచలనం సృష్టించింది. ముందుగా భర్తను అనుమానించారు పోలీసులు. లోతైన దర్యాప్తు తర్వాత భార్య రజిత బాగోతం బయటపడింది. కొన్నాళ్ల క్రితం రజిత టెన్త్ క్లాస్‌మేట్స్ గెట్ టుగెదర్‌కు వెళ్లింది. అక్కడ ఓ స్నేహితుడితో పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారనే కారణంతో వాళ్లను చంపాలని ప్లాన్ చేసింది. ఫిబ్రవరి 27 శుక్రవారం రాత్రి పిల్లలకు పెరుగన్నంలో విషం పెట్టి తినిపించింది. భర్త చెన్నయ్య ఆరోజు పెరుగు తినకుండా భోజనం ముగించాడు. తర్వాత వాటర్ ట్యాంకర్ డ్రైవింగ్ పనిపై బయటకు వెళ్లిపోయాడు. తిరిగొచ్చాక చూస్తే పిల్లలు విగతజీవులుగా పడి ఉన్నారు. ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. 12 ఏళ్ల సాయికృష్ణ, 10 ఏళ్ల మధు ప్రియ, 8 ఏళ్ల గౌతమ్ మృతితో తీవ్ర విషాదం నెలకొంది. ఎందుకిలా జరిగిందో తనకు తెలియదని, తాను కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యానని రజిత చెప్పడంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించాడు భర్త. చివరికి విచారణలో ప్రియుడితో కలిసి రజిత చేసిన ఘోరం బయటపడింది. రజితతోపాటు ఆమె ప్రియుడూ ఇప్పుడు పోలీసుల అదుపులో ఉన్నారు. వివాహేతర సంబంధం మోజులో పడి కడుపున పుట్టిన బిడ్డలను చంపుకోవటంపై స్థానికులు మండిపడుతున్నారు. ఆమెకు కఠిన శిక్ష వేయాలని కోరుతున్నారు.





## ఉనికిని చాటిన భావ వ్యక్తీకరణ

‘కృష్ణా! నేను కార్పణ్య (పిరికితనము) దోషానికి లోనై, నా స్వభావానికి దూరమయ్యాను. ధర్మాధర్మ విచక్షణ జ్ఞానం లోపించి కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేక పోతున్నాను. నేనిప్పుడు నీకు శిష్యుడిని. శిష్య వాత్సల్యతతో నాకేది శ్రేయస్కరమో దానిని ఉపదేశించు’ అంటున్నాడు, అర్జునుడు. సర్వసమర్పణ భావనతో పార్థుడు తన సమస్యను పరమాత్మకు నివేదించాడు. అర్జునుని మాటలు సమంజసంగా కనిపిస్తున్నా ధర్మబద్ధమైనవి కావు. భావోద్వేగాలకు లోనైన వేళ మనసు ఆవేశపూరితం అవుతుందే కాని ధర్మాన్ని గ్రహించదు. ప్రశాంతత నిలిస్తేనే విచక్షణ జ్ఞానం వెలుగుచూస్తుంది. పూర్వం ఎన్నో యుద్ధాలలో అర్జునుడు ప్రతివీరులను సంహరించాడు. దానితో వచ్చిన యశస్సును ఆస్వాదించాడు. అప్పుడు వ్యామోహం కలగలేదు. ఎందుకు? వారంతా పరాయివారు.. ఇప్పుడు ఎదురుగా నిలిచిన వారిని తనవారుగా భావిస్తున్నాడు. తనవారికొక ధర్మం, పరులకొక ధర్మమా? యుద్ధంలో తనవారు చనిపోతారు నిజమే కాని, యుద్ధం చేయకపోతే మాత్రం వారు శాశ్వతంగా జీవిస్తారా? అర్జునుడి శక్తిసామర్థ్యాలను నమ్ముకొనే పాండవులు యుద్ధాన్ని కోరుకున్నారు. అర్జునుడు యుద్ధానికి భయపడి అస్త్రసన్యాసం చేయలేదు. భ్రమలో స్వజన సంహారమనే వ్యామోహానికి లోనై ఆ పనిచేశాడు. దుష్టశిక్షణ అనే కర్తవ్యాన్ని బాధ్యతతో నిర్వహించాల్సిన సమయంలో అర్జునునిలో ట్కక్లైబ్యత్వం (అధైర్యం) చోటుచేసుకున్నది. అర్జునుడు యుద్ధం చేస్తాడా, చేయడా.. కృష్ణుడికి అనవసరం. అర్జునుడి సమస్య మృత్యుభీతి. నిజానికి బాధ్యతారాహిత్యాన్ని సమస్యగా చూస్తున్నాడు. ఆ సమస్యను పరిష్కరించాలి. అర్జునుడి మనస్సు ఇప్పుడు పూర్తిగా పరమాత్మ బోధను ఆకళింపు చేసుకునేందుకు సన్నద్ధమై ఉన్నది. ఆ సన్నద్ధతనే స్త్రీ శక్తిగా చెబుతారు. కృష్ణుడి మనసు ప్రశాంతమై బోధించేందుకు సన్నద్ధమై ఉన్నది.. దానినే పురుష శక్తిగా చెప్పుకొందాం. రెండూ ఒకదానికి మరొకటి అనుసంధానం కావడం వల్ల అక్కడ అయస్కాంత వలయం ఏర్పడి.. గురుశిష్యుల మధ్య భావ ప్రసరణ జరుగుతుంది. ‘గురోః మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయః’ అన్నట్టుగా గురువు మౌనంగా వ్యాఖ్యానం చేస్తున్నాడు..



ఆధ్యాత్మికం

## లక్షెట్టిపేట ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం ఎన్నిక



**లక్షెట్టిపేట, ఏప్రిల్ 02 (ది క్రైమ్ న్యూస్):** లక్షెట్టిపేట సర్కిల్ ( దండేపల్లి, జన్నారం, లక్షెట్టిపేట మండలాల) ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఐబీ విశ్రాంత భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చింత అభినయ్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జన్నారం మండలానికి చెందిన నూతి సంతోష్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, ప్రదీప్, జాయింట్ సెక్రటరీలుగా సోక్రటీస్, అనిల్, కోశాధికారిగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సభ్యులు వై శ్రీనివాస్, ఎర్రం తిరుపతి, పేరం రమేష్, నిజామోద్దీన్, గడ్డం వినీత్, ఆకుల కిరణ్,ముస్తఫా, బుర్ర శ్రీనివాస్, రాజేష్, రమేష్, సతీష్, అనిల్,మహేష్,కుమార్,అజ్మాత్, మహేందర్ పాల్గొన్నారు.

## ముస్లీం మైనారిటీ ఆధ్వర్యంలో విందు





**లక్షెట్టిపేట, ఏప్రిల్ 02:(ది క్రైమ్ న్యూస్):** రంజాన్‌ను పురస్కరించుకొని ఉపవాస సమయంలో పలు రకాలుగా సేవలందించిన పలు ప్రభుత్వ విభాగాల అధికారులకు బుధవారం ముస్లీం మైనారిటీ ఆధ్వర్యంలో స్నేహపూర్వకంగా విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లీం మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ లో ముస్లీంలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, మున్సిపల్, పోలీస్ శాఖలు సహకరించయన్నారు. ప్రతి ఏటా లక్షెట్టిపేటలో మత సామరస్యం వెల్లివిరుస్తోందని వివరించారు. అనంతరం పలువురు అధికారులకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నవాబ్ ఖాన్, నాయకులు అబ్బు భాయ్, జమీర్, ఇషాక్, ఇలియాస్, అన్వర్, షా ఖాన్, సజిల్ అంజుమ్, రియాజ్, మున్నా, సమీర్, శ్రీధర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ ను సన్మానించి సిమాఎంవెఆ నాయకులు



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించటం పట్ల హర్షిస్తూ, ఎం.ఆర్.పి.ఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ను సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ నెంబర్ 365 బై 22 కేంద్ర కమిటీ సభ్యులు బుధవారం శాలువాల కప్పి సన్మానించారు. ఉదయం హైదరాబాద్ లో మంద కృష్ణ ను కలిసిన అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. సింగరేణిలో రానున్న రోజుల్లో ఎస్సీ వర్గీకరణ ఫలాలు తెలంగాణ రాష్ట్రం అభీష్టం మేరకు అమలయ్యే విధంగా, అసోసియేషన్ పరంగా పర్యవేక్షించాలని మంద కృష్ణ మాదిగ, అసోసియేషన్ నాయకులకు సూచించారు. అలాగే ఎస్సీ వర్గీకరణ ఫలాలు క్రింది స్తాయి ఉద్యోగుల నుండి ఉన్నత స్తాయి ఉద్యోగుల వరకు అందేలా చూడాలని ఆయన వారిని ఆదేశించారు. మంద కృష్ణ ను కలిసిన వారిలో మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పదండి దుర్గ ప్రసాద్, గౌరవ సలహాదారులు కె. రాజేశ్వరరావు, అధ్యక్షులు బొంకూరి మోహన్, శ్రావణ్ కుమార్, కేంద్ర కమిటీ నాయకులు ఏ. చంద్రమౌళి, ఎం.ఎం. కృష్ణ, లతోపాటు వివిధ ఏరియా నుండి వచ్చిన నాయకులు ఉన్నారు.

## హెచ్.సి.యూ విద్యార్థుల పై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు

### - జనసేన పార్టీ నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



**కూకట్ పల్లి ఏప్రిల్ 02 (ది క్రైమ్ న్యూస్):** హెచ్. సి.యూ భూములను అమ్మితేనే ఖజానా నిండుతుందా, పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వానికి బాధ్యత లేదా, యూనివర్సిటీ భూముల కోసం పోరాడుతున్న విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టడం వారి పై కేసులు పెట్టడం దుర్మార్గం అని జనసేన పార్టీ నేత కూకట్ పల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. హెచ్. సి.యూ విద్యార్థుల పై నమోదైన కేసులను వెంటనే కొట్టివేయాలనీ ప్రేమ కుమార్ డిమాండ్ చేశారు. హెచ్ .సి. యూ 400 ఎకరాల ఆక్రమణ ఆపివేయాలినీ, లేనిచో జనసైనికులు ఉద్యమించడం తప్పదనీ ప్రేమ కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం, అనుమతి లేని డ్రోన్, డిజెలపై

# కమిషనరేట్‌లో నిషేధాజ్ఞల కొనసాగింపు

### • రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేని డ్రోన్, డిజె సౌండ్స్‌పై నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, అదేవిధంగా చిన్నపిల్లలు, వఅద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలను 01.04.2025 నుంచి 01.05.2025 వరకు కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం కూడా ఉందని తెలిపారు. బిఎన్ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పరిధిలో రామగుండం పోలీస్ కమిషనరేట్ 7 (1), 2016, యాక్ట్, 22 (1) (ఎ) నుంచి (ఎఫ్) మరియు 22 (2) (ఎ) అండ్ (బి), అండ్ 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 నెంబర్ 9 ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం తేది ఏప్రిల్ 01, 2025 ఉదయం 6 గంటల నుంచి మే 01, 2025 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటుందని సిపి ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని, బంద్‌ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సిపి సూచించారు.

# ఏరియా ఉద్యోగులు అభినందనీయులు

### - సింగరేణి ఏరియా జీఎం సుధాకర్ రావు





**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సమిష్టి కృషితోనే ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించామని సింగరేణి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావు అన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25 లో ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించినందుకు గాను బుధవారం ఉదయం ప్రాజెక్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ముందుగా ప్రాజక్ట్ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం ఏరియాకు నిర్దేశించిన 62,50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్నీ అధిగమిస్తూ 104 శాతంతో 65,11 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందన్నారు. ఇక ఇందులో ఓసీపీ.1 ప్రాజెక్ట్ ఉద్యోగులు నిర్దేశిత 35 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 35.01 లక్షల టన్నుల ఉత్పత్తి సమిష్టి కృషితో సాధించారని తెలిపారు. సింగరేణి సంస్థకు అద్భుతమైన నాయకత్వం అందించడమే కాకుండా, క్షేత్ర స్థాయి పర్యటనల తో ఉద్యోగులందరిలో చైతన్యం కలిగిస్తూ, ప్రోత్సాహాన్ని నింపుతూ చక్కని మార్గదర్శకత్వం అందిస్తున్న సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ కు, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్న డైరెక్టర్లు డి. సత్యనారాయణ రావు, ఎల్.వి. సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు లకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే సంస్థలోని పలు విభాగాల అధికారులకు, కార్మికనాయకులకు, కార్మికులకు మరోమారు అభినందనలు తెలిపారు. ముఖ్యంగా లక్ష్య సాధనలో ఎప్పటికప్పుడూ తగిన సహాయ సహకారాలను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సమిష్టి కృషితో, భద్రతతో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని జీఎం సుధాకర్ రావు ఆకాంక్షించారు. ఇంకా ఈ అభినందన సభలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి ఎల్. వినాయక్, ప్రాజెక్ట్ అధికారి జె. రాజశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉదయభాస్కర్, ఇంచార్జ్ మేనేజర్ కోటయ్య, నాయకులు డి. తిరుపతిరావు, గునుగంటి వెంకటస్వామి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డులపై దేశ ప్రధాని ఫోటో ముద్రించాలి

### - బిజెపి ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్



**ధర్మపురి, ఏప్రిల్ 2, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేసే రేషన్ కార్డులపై దేశ ప్రధాని ఫోటో ముద్రించాలని బిజెపి ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన బీజేపీ పట్టణ నాయకుల సమావేశంలో బాస్కర్ మాట్లాడుతూ సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్న చందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన రేషన్ కార్డుల మంజూరు కార్యక్రమంలో భాగంగా జారీ చేసే ప్రతి కార్డుపై దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోటోను ముద్రించాలని వారు డిమాండ్ చేశారు. భారత ఆహార భద్రత చట్టం ప్రకారం నిరుపేదలకు పదివేల కోట్లు సబ్సిడీ ఇచ్చి ఉచితంగా కేంద్రం బియ్యం పంపిణి చేస్తే అది రాష్ట్ర ప్రభుత్వం యొక్క గొప్ప పనిగా చెప్పుకోవడం సిగ్గుచేటని సొమ్ము ఒకరిది సోకు ఇంకొకరిది అన్నట్లుగా ఉందని బిజెపి ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ కాంగ్రెస్ ప్రభుత్వం ను విమర్శించారు. గత అయిదు సంవత్సరాల నుండి కరోనా సమయం నుండి ఇప్పటి వరకు ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కార్యక్రమం కింద తెలంగాణాలోని మూడు కోట్ల యాభై లక్షల మందికి ప్రతి నెల కేద్ర ప్రభుత్వం తరుపున నెలకు 5 కిలోల బియ్యాన్ని ఉచితంగా ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవల 1 కిలో మాత్రమే బియ్యం పంపిణీ చేస్తోందని బాస్కర్ గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో 6 కిలోల బియ్యం తమ ప్రభుత్వమే ఇస్తుందని చెప్పుకోవడం సిగ్గు చేటు అన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే కొత్త రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి ఫోటోతో పాటు సంభంధిత శాఖ మంత్రి ఫోటో ప్రోటోకాల్ ప్రకారం ప్రధానమంత్రి ఫోటో కూడా ముద్రించాలని పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిలో తొంబై శాతం నిధులు కేంద్రానివేనని అభివృద్ధి పనులు జరిగిన చోట కేంద్ర ప్రభుత్వం వాటాను రాష్ట్ర ప్రభుత్వం వాటాను సూచించే బోర్డులను ఏర్పాటు చేసి పారదర్శకమైన పాలనను ప్రజలకు తెలపాలని బాస్కర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణను చిన్న చూపు చూస్తుందని అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు వెచ్చిస్తుంటే అవి రాష్ట్ర ప్రభుత్వ నిధులు అని ఎమ్మెల్యేలు చెప్పుకోవడం సిగ్గుచేటని బాస్కర్ అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం జరిగిన ప్రతి చోట ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని బీజేపీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు నిత్యావసర సరుకులు పంపిణి చేసే రేషన్ షాప్ ఉన్న ప్రతి చోట ముఖ్యమంత్రి ఫోటోతో పాటు ప్రధానమంత్రి ఫోటోను ఉంచాలని లేనట్లయితే తామే ప్రధానమంత్రి ఫోటోను ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, బండారి లక్ష్మణ్, బెజ్జారపు లవన్, తిరుమందాస్ సత్యనారాయణ, దీవిటి శ్రీధర్, మండలోజీ సూరజ్, పిల్లర్ల సురేందర్, ఆనందాస్ నవీన్, కాశెట్టి హరీష్, వేలగందుల ప్రణీత్, కాలకూట రాజు, శ్యామ్ రావు నాగులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సన్న బియ్యం పంపిణీ

## చేస్తున్న రేషన్ షాపుల దగ్గర మోడీ చిత్రపటాన్ని పెట్టాలని డిమాండ్

### ◆ ఎమ్మార్వోకి వినతిపత్రం



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ షాపుల్లో నరేంద్ర మోడీ ఫోటోను పెట్టాలని డిమాండ్ చేస్తూ కమలాపూర్ మండల స్థానిక తహసీల్దార్ వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 కరోనా సమయం నుండి కేంద్ర ప్రభుత్వం ఈ దేశంలో ఉన్న నిరుపేదలకు ఆహార ధాన్యాలు అందాలని ఆకలితో అలమటించకుండా పేదవాడు బ్రతకాలని దాదాపు 80 కోట్ల మందికి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద ఉచిత రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికిగాను కేంద్ర ప్రభుత్వం ఒక మనిషికి ఐదు కిలోల బియ్యాన్ని పూర్తిగా ఉచితంగా పంపిణీ చేస్తుంది ఈ రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో మాత్రమే ఇస్తూ అదేదో మేము పూర్తిగా ఇస్తున్నట్టు ప్రగల్భాలు పలుకుతున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వమే సన్న బియ్యం పంపిణీ చేస్తుందని కాంగ్రెస్ వచ్చిన తర్వాతనే ఈ సన్న బియ్యం కార్యక్రమం చేపట్టిందని ఊకదంపుడు మాటలు చెబుతూ పూర్తిగా ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఆ తర్వాత ప్రోటోకాల్ లేకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాప్ కేంద్రాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఓడిపోయిన నాయకుల ఫోటోలు కూడా పెట్టడం జరిగింది. నిన్న కమలాపూర్ మండల్ లో హుజరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడితేలా ప్రణవ్ బాబు ఓడిపోయినప్పటికీ ప్రోటోకాల్ పాటించకుండా కనీసం ఫ్లెక్సీ మీద నరేంద్ర మోడీ ఫోటో లేకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. దీన్ని కమలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ పక్షాన పూర్తిగా ఖండిస్తూ రాబోయే కాలంలో ప్రోటోకాల్ ప్రకారమే అధికార కార్యక్రమాలు జరగాలని ఓడిపోయిన అభ్యర్థులకు ప్రోటోకాల్ ఇవ్వకూడదని అలాగే రేషన్ పంపిణీ చేసే షాపుల వద్ద నరేంద్ర మోడీ ఫోటోలు పెట్టాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలారా పనిచేస్తున్నారని దుయ్యాబట్టారు. కమలాపూర్ మండలంలోని రేషన్ దుకాణాల వద్ద కచ్చితంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని ప్రోటోకాల్ లేకుండా ఇతర నాయకుల ఫ్లెక్సీలు పెట్టినట్లయితే భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు వాటిని పూర్తిగా తొలగిస్తారని ఈ సందర్భంగా హెచ్చరిస్తూ ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్ ప్రకారము నడుచుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెలిక శ్రీనివాస్ మాజీ సర్పంచ్, తోట సురేష్, కట్కూరి అశోక్ రెడ్డి, భూపతి ప్రవీణ్, తుమ్మ శోభన్ బాబు, బండి కోటేశ్వర్, పుల్లా అద్భుతరావు,ఇనుగాల రత్నాకర్, జెట్టి సారంగపాణి, బండారి సుధాకర్, పాక కుమారస్వామి, పెండ్యాల ప్రభాకర్ రెడ్డి, ధర్మల ప్రతాప్, పెండ్యాల తిరుపతి, వాసాల సత్తయ్య,నాసాని రాజు, శనిగరం సంపత్, పుల్లా రాజ్ కుమార్, పోలోజు రాజేశం, చేరాల రాంబాబు, గుర్రం సురేష్, రావుల ఆకాష్, కడారి గణేష్, ఖాట్మండ్ల రాజేశ్వరరావు,బండి వినయ్ సాగర్, సంఘ ఐలయ్య, గూడూరి ప్రసాద్, వరికోలు రాజేందర్, చెర్రిపల్లి రతన్ కుమార్, పబ్బు సుభాష్, మాట్ల మొగిలి,ఒస్కులా రత్నం, పుల్ల సంజీవ్, మోకిడే సాంబయ్య, మోకిడే వెంకటేశ్వర్లు, బండి లక్ష్మణ్, కోడారి కుమార్, పసునూటి రాణా ప్రతాప్, పులి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి



**జమ్మికుంట ఏప్రిల్ 2 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో జమ్మికుంట మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గారి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడతల ప్రణవ్ బాబు ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆనాడే గెరిల్లా సైన్యాన్ని తయారుచేసి మొగులు చక్రవర్తులతో పోరాడి విజయం సాధించారు హైదరాబాద్ గోల్కొండ కోటను కైవసం చేసుకొని కొన్ని సంవత్సరాలు పరిపాలన అందించారు. గొప్ప నాయకత్వ లక్షణాలున్న సర్దార్ సర్వాయి పాపన్న గారి ఆశయ సాధనాల కోసం ఈనాడు మన గౌరవ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ సర్దార్ సర్వాయి పాపన్న స్వగ్రామమైన సర్వేపేటలో కొన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారు పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ నియోవర్గా పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పొన్నగంటి మల్లన్న, ఎర్రం సతీష్ రెడ్డి, సుంకరి రమేష్, గూడెపు సారంగపాణి, సాయిని రవి, బొంగోని వీరన్న, శ్రీపతి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పని వేళల మార్పుకై "ఇఫ్టు" నాయకుల విన్నపం




**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కాంట్రాక్టు కార్మికులకు పని వేళలు మార్పు చేయాలని కోరుతూ ఎస్.సి.సి.డబ్ల్యూ.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. అశోక్ సింగరేణి రామగుండం రెండవ డివిజన్ యాజమాన్యానికి బుధవారం ఒక వినతి పత్రం అందజేశారు. సాయంత్రం కాంట్రాక్ట్ కార్మికులను వెంటతీసుకెళ్లిన అశోక్ యాజమాన్యం పక్షాన డివిజన్ డీజీఎం పర్సనల్ ఎస్. అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండల మూలంగా కాంట్రాక్టు కార్మికులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని, తద్వారా వడదెబ్బకు గురి అవుతిన్నారని, అంతేకాకుండా అనారోగ్యాల పాలవుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రతీ సంవత్సరం మాదిరిగానే, ఈ సారి కూడా పని వేళలు మార్పు చేయాలని కోరారు. అలాగే మజ్జిగ, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ నాయకులు డి. బుచ్చమ్మ, ఎం. రమ, ఆర్. లక్ష్మి, లావణ్య ఉన్నారు.

## అడవిశ్రీరాంపూర్‌లో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

**ముత్తారం.ఏప్రిల్.02.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.వర్ధంతి సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన వీరుడు సర్వాయి పాపన్న రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు,జాగీర్దాల అరాచకాలను సహించలేక కత్తి పట్టిన వీరుడని,దళిత,బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామన్య బహుజన వీరుడు పాపన్న గౌడ్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గట్టు రమేష్ గౌడ్,గట్టు సదయ్య గౌడ్,సట్ల సతీష్ గౌడ్,దేశ్ని రవీందర్ గౌడ్, ఏగొలపు కుమారస్వామీ గౌడ్, గట్టు మహేష్ గౌడ్ లతో పాటు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు ఎంసీపల్లి లో మెడిసిటీ హాస్పిటల్ వారి..

### - మేడ్చల్ గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిభిరం




**శామీర్ పేట, ఏప్రిల్ 02 (ది క్రైమ్ న్యూస్):** మెడిసిటీ హాస్పిటల్, ఘనపూర్, మేడ్చల్ గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిభిరం. గురువారం మూడు చింతలపల్లి గ్రామం లోని గ్రామపంచాయతీ ఆఫీస్ దగ్గర ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం క్యానర్ స్క్రీనింగ్ శిభిరం నిర్వహించబడును. ఈ వైద్య శిభిరంలో బీపీ, షుగర్ పరీక్షలు కంటి పరీక్షలతో గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు కూడా చూడబడును. మందులు ఉచితంగా పంపిణీ చేయబడును.ఇట్టి అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మేడ్చల్ జిల్లాలో గల నిరుద్యోగా యువతి యువకులకు సదా అవకాశం..

### - అధికారిణి ఇండియన్ ఆర్మీ అవేర్నెస్ ప్రోగ్రాం చేస్తున్నట్లు తెలిపారు

**శామీర్ పేట, ఏప్రిల్ 02 (ది క్రైమ్ న్యూస్):** మేడ్చల్ జిల్లాలో గల నిరుద్యోగా యువతి యువకులకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారిణి ఇండియన్ ఆర్మీ అవేర్నెస్ ప్రోగ్రాం చేస్తున్నట్లు తెలిపారు.. ఇండియన్ ఆర్మీలో నియామకం కోసం ఔత్సాహిక అభ్యర్థులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్, అప్లికేషన్ ద్వారా తమ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారిణి. ఏం. రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరీల వారీగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ (క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్), అగ్నివీర్ ట్రేడిసెమ్మేస్ డు 10వ తరగతి పాస్ మరియు అగ్ని వీర్ ట్రేడ్ సెమెస్ (8వ తరగతి పాస్) ఉత్తీర్ణత కలిగి ఉండాలని, అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా ఏదైనా రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శీర్ అదేవిదంగా ఐటీఐ, డిప్లమో, ఎన్ సిసి అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులు ఉంటాయని, 13 భాషలలో కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఆన్లైన్ విధానంలో చేపట్టడం జరుగుతుందని.. అభ్యర్థులు ద్వారా ఏప్రిల్ 10 వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ తదుపరి అభ్యర్థులు జున్ 2025 మాసంలో సంబంధిత సైట్ నుండి అడ్మిట్ కార్డు పొందవచ్చునని అప్డేట్స్ కొరకు పెబ్సైట్, అభ్యర్థులు వారి వారి ఈమెయిల్ ఐడి ని పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. మెరిట్ ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందని, సలహాలు సూచనలకై సికింద్రాబాద్ లోని రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నెంబరు 040 -27740205 లో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు..!



**కమాన్ పూర్, ( ది క్రైమ్ న్యూస్) ఏప్రిల్ 2:** సర్దార్ సర్వాయి పాపన్న 315 వ వర్ధంతి వేడుకలు నాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాల గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ... సర్దార్ సర్వాయి పాపన్న బడుగు బలహీన వర్గాల కోసం పాటు పడిన మహా నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు బత్తిని నాగమణి గౌడ్, మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కుమార్ గౌడ్, లింగాల గౌడ సంఘం అధ్యక్షుడు నల్లగొండ నాగరాజు, ఉపాధ్యక్షులు కమ్మగోని భాస్కర్ గౌడ్, సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, వడ్లకొండ లక్ష్మణ్ గౌడ్, బుర్ర రవి గౌడ్,నల్గొండ శంకరయ్య గౌడ్, మాజీ సర్పంచ్ సాగి శ్రీధర్ రావు, వడ్లకొండ లింగయ్య గౌడ్ మల్యాల ఓదెలు గౌడ్, ముత్యం నరసయ్య పాల్గొన్నారు.

## పారువెల్ల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా మంకాలి మల్లికార్జున్



**గన్నేరువరం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్లలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా మంకాలి మల్లికార్జున్,మండల ఉపాధ్యక్షుడిగా ఈగ రాజయ్యను నియమిస్తూ ముస్కు ఉపేందర్ రెడ్డి బుధవారం నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షులు మాతాంగి అనిల్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగు దేవయ్య,బద్దం రాంరెడ్డి, లింగంపెల్లి శ్రీకాంత్, తిరుపతి రెడ్డి, న్యాత జీవన్, ఈగ నర్సయ్య, మాంకాలి లస్మయ్య , రామయ్య ,అంజయ్య , యాల్ల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**ధర్మపురి, ఏప్రిల్ 2, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన సభ్యులకి ఎన్నికల అధికారి అధ్యక్షతన జరిగిన ఎన్నికలలో ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొనారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఆలుక వినోద్ కుమార్, ఉపాధ్యక్షునిగా బందెల రమేష్, ప్రధాన కార్యదర్శి గా మామిడాల శ్రీకాంత్ కుమార్, సంయుక్త కార్యదర్శి గా గూడ జితేందర్ రెడ్డి, కోశాధికారి జజాల రమేష్, క్రీడ సంస్కృతిక కార్యదర్శి బత్తిని ఇంద్రకరణ్, గ్రంథాలయ కార్యదర్శి గా సుంకే రాజు, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా గడ్డం సత్యనారాయణ రెడ్డి, అప్పాల నిరంజన్, కార్యవర్గ సభ్యులుగా కస్తూరి శరత్ కుమార్, ఒరగంటి చంద్రశేఖర్ లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం లో జగిత్యాలకు చెందిన సీనియర్ న్యాయవాదులైన బెత్తేపు లక్ష్మణ్, మారిశెట్టి ప్రతాప్, కే వేంకటేశ్వర రావ్, ఎర్ర నర్సయ్య, దుమ్మేనా శ్రీనివాస్, రౌత్ రాజేష్,ఏ జి పి ఇమ్మడి శ్రీనివాస్, గంగాధర్, కే. గంగరాజం, కార్తీక్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

## ఉచిత పశు వైద్య శిబిరము



**ధర్మపురి, ఏప్రిల్ 2, (ది క్రైమ్ న్యూస్):** వ్యవసాయ మార్కెట్ కమిటి ధర్మపురి చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ ఆధ్వర్యంలో ధర్మపురి వెటర్నరీ డిపార్టుమెంటు వారి సహకారంతో బుధవారం ధర్మపురి మండలం నాగారం గ్రామం నందు ఉచిత పశు వైద్య శిబిరము నిర్వహించబడినదని తెలిపారు. ఈ శిబిరములో దాదాపు 136 పశువులకు ఆవులు, బర్లు, మేకలు, గొర్లు, కోళ్ళు చికిత్స చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వులకు చూడి (గర్భనిర్ధారణ) పరీక్షలు, కట్టు నిల్వకపోవడం సమస్య లకు,గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స, కట్టుకు రాని పెయ్య లకు పరీక్షలు, వివిధ రకాల వ్యాధులకు చికిత్స, దూడలకు నట్టల నివారణ మందులు ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. రైతులకు సబ్సిడీ ధరలో పశుగ్రాస విత్తనాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డా. దుంపల వేణుగోపాల్, పాడి రైతులకు పశు పోషణ, పశుగ్రాశ పెంపకం ఉపయోగాలు, ఖనిజ లవణ మిశ్రమం ఆవశ్యకత, అధిక పాల దిగుబడి రావడానికి అనుసరించాల్సిన యజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. మరియు ఇతర ఆరోగ్య సమస్యలు కలిగిన పశువులను పరీక్షించి ఉచితముగా మందులు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు మరియు పాలకవర్గ సభ్యులు ఎండి. రాఫియోద్దిన్, తోట్ల రాజయ్య, గునిశెట్టి అంజయ్య, కాశెట్టి రాజేష్, మరియు వెటర్నరీ డాక్టర్స్ శ్రీ దుంపల వేణుగోపాల్, ధర్మపురి మండల్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, జే. సునీల్ కుమార్, సారంగాపూర్ భీర్పూర్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మరియు వారి సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ ప్రశాంత్, గణేష్, ఓ ఎస్ మురళి దేవయ్య, గోపాలమిత్ర భూమేష్ మరియు మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గడ్డం భాస్కర్ రెడ్డి, గడ్డం సత్యనారాయణ రెడ్డి, గడ్డం మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటి పర్యవేక్షకులు జి. వెంకట నర్సయ్య మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు హరిపురంలో ఉచిత వైద్య శిబిరం



**ముత్తారం.ఏప్రిల్.02.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్ తెలిపారు.బుధవారం ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్ రైజ్ ఆసుపత్రి కరీంనగర్ వారి సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ వైద్య శిబిరంలో బిపి,షుగర్,గుండె పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- గండి రంజిత్ కుమార్ గౌడ్



**జమ్మికుంట ఏప్రిల్ 2 (ది క్రైమ్ న్యూస్):** సర్వాయి పాపన్న 315 వ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గండి రంజిత్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తాడిచెట్టు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ గౌడ్ ప్రణవ్ బాబుకు విన్నవించారు. గత ప్రభుత్వం విఫలమైంది కాబట్టి ఈ ప్రభుత్వమైనా పెండింగ్లో ఉన్న ఎక్స్గ్రేషియాలో గీత కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులు తెలంగాణ రాష్ట్రంలో తాడిచెట్టు ప్రమాదంలో చనిపోయి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు కూడా ఆ కుటుంబాలకు ఎక్స్గ్రేషియా రాకపోవడం బాధాకరమని ఇప్పటికైనా ప్రభుత్వంతో మాట్లాడి బాధిత కుటుంబాలకు ఎక్స్గ్రేషియా అందే విధంగా కృషి చేయాలని ప్రణవ్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్,, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దేశినీ కోటి ,మార్కెట్ డైరెక్టర్ గడ్డం దీక్షిత్ గౌడ్ లు ఉన్నారు.

## సమాచార హక్కు ప్రజావేగుల న్యాయ సేవ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ







**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామ పంచాయితి ఆఫీసర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది .ఈ కార్యక్రమం లో వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మారేపల్లి సత్యం (సత్యపాల్ ) మాట్లాడుతూ సమాచార హక్కు అందరి హక్కు దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ,సరైన సమాచారం పొందాలని వివిధ శాఖల నుండి మనకు వీలైన సమాచారాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు, ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల కమిటీ అధ్యక్షులు నరేష్ ,ఉపాధ్యక్షులు విజయ్ , సెక్రటరీ వెంగల సాయి, అడ్వాసర్ ర్యకం సాయి,సోషల్ మీడియా ఇన్చార్జి పంజల రాజేష్ , తదితరులు పాల్గొనడం జరిగింది.

## రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- వాడ వాడలా ఉత్సాహంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర..





**హుజురాబాద్ ఏప్రిల్ 2 (ది క్రైమ్ న్యూస్):** దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలకు పాల్పడుతూ,రాజ్యాంగాన్ని ఉల్లంగిస్తుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుదవారం రోజున హుజురాబాద్ మండల పరిధిలోని పోతిరెడ్డిపేట గ్రామంలో ఏఐసీసీ పిలుపు మేరకు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ రాష్ట్రీయ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను గ్రామంలోని వాడ వాడకు నిర్వహించారు. రాహుల్ గాంధీ చేపట్టిన న్యాయ్ భారత్ జోడో పాదయాత్ర ద్వారా రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా దేశమంతటా పాదయాత్ర చేపట్టారనీ,తద్వారా బీజేపి రాజ్యాంగ విరుద్ధ పనులకు అడ్డుకట్ట వేయగలిగామని అన్నారు.పార్లమెంట్ సాక్షిగా బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ ను విమర్శిస్తూ అవమాణపరిచారని,మతాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని అన్నారు.తక్షణమే అమిత్ షా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.స్వాతంత్రం కొట్లడిన గాంధీజీనీ, రాజ్యాంగం రచించిన అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ రాజ్యాంగ విలువలను కాపాడతమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాల్లు,కాంగ్రెస్అనుభంధసంఘాలనాయకులు,కార్యకర్తలుఅధికసంఖ్యలోపాల్గొన్నారు.

# పోలీసు శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా పని చేయాలి

- రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా
- 51 మంది కానిస్టేబుల్స్‌కు హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితోపాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 51మంది కానిస్టేబుల్స్‌కు హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందిన అధికారులకు బుధవారం రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా సిపి కార్యాలయంలో అభినందించి, వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని, ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటామని, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏద్కైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, ఎఓ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, సూపరింటెంట్‌లు సందీప్, మనోజ్ కుమార్, సిసి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి.. • జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**ఇల్లందకుంట ఏప్రిల్ 2 (ది క్రైమ్ న్యూస్):** ఈనెల 4 నుండి జరగనున్న కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం ఇల్లందకుంట తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగింది. బ్రహ్మోత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌస్ ఆలం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4 నుండి 16 వరకు ఇల్లందకుంట దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు అంతరాయం లేకుండా చూడాలని, అధిక లోటును దృష్టిలో ఉంచుకొని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులు వివిధ మార్గాల ద్వారా వచ్చే అవకాశం ఉన్నందున సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. భారీకేడ్లు, లైటింగ్, తాగునీటి సదుపాయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లా నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించాలని సూచించారు. స్వామివారి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా లైవ్ టెలికాస్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు అవసరమైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి భోజన వసతి కల్పించాలని అన్నారు. ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి



కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ఇల్లందకుంట దేవస్థానం అతి పెద్దదని అన్నారు. ఈసారి సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి భక్తుడికి భోజనం, తాగునీరు అందిస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఉత్సవాల కోసం 6 పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు వెయ్యి వాహనాలు పార్కింగ్ చేయవచ్చని అన్నారు. సీసీ కెమెరాలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ఆర్డీవో రమేష్, ఏసీపి శ్రీనివాస్ జి, ఆలయ ఈవో సుధాకర్ పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు సాగు నీరు చేరేలా చర్యలు

- ఎస్సారెస్పీ కాల్వలను తనిఖీ చేసి పర్యటించిన
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**కమన్ పూర్, (ది క్రైమ్ న్యూస్): ఏప్రిల్-02:** చివరి ఆయకట్టు వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కమాన్ పూర్, పెద్దపల్లిలి ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి మండలం రంగాపూర్ 43.5 కిమీ వద్ద ఎస్సారెస్పీ డీ 83 కాలువ ను , కమాన్ పూర్ మండలం గుండారం వద్ద ఆర్.ఎస్.బీ కెనాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఎస్సారెస్పీ నుంచి విడుదలయ్యే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఉండటానికి వీలు లేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. చివరి విడత నీటి విడుదల జరుగుతున్నందున ఎక్కడ పోలాలు ఎండిపోకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. కాల్వలో సిల్ట్ తొలగింపు, చిన్న చిన్న మరమ్మత్తులకు ప్రతిపాదనలు అందిస్తే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎస్.ఈ. సత్య రాజ్ చంద్ర, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కే .శ్రీనివాస్, ఈ.ఈ .మంథని బలరామయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది.

# పోత్కపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి



**పెద్దపల్లి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పోత్కపల్లి పోలీస్ స్టేషన్ సందర్శించారు. పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ కేసులలో సిజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం రిసెప్షన్ సిబ్బందిని అడిగి పిర్యాదుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యను తెలుసుకొని వారికీ భరోసా నమ్మకం కల్పించాలని చట్టపరిధిలో సమస్య పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సీపీ ఎస్ఐ రమేష్ ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో ఉన్న మావోయిస్టు ప్రభావిత గ్రామాలు, వారి కదలికలు, అజ్ఞాతం లో ఉన్న వారి వివరాలు, ఈ ప్రాంతం లో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి, సమస్యత్మక గ్రామాల, సరిహద్దు ప్రాంత వివరాలు, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత ఎస్ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను అడిగి తెలుసుకున్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి అక్రమ రవాణా, సరఫరా, నిల్వ, సేవించే వారిపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

- జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ పేరు పెట్టాలి
- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి.రమణ



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** రాచరికాన్ని ఎదిరించి స్వేచ్ఛ కోసం గోల్కొండను ఆక్రమించి ఉద్యమించిన మహానీయుడు, ప్రజలకు స్వేచ్ఛ కోసం బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ్ అని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి.రమణ, గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు.డివిజన్ కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వర్ధంతి వేడుకలను గౌడ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విశ్రాంతి ముందు ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో చత్రపతి శివాజీ మహారాజ్ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజులు మాత్రమే మొగల్ పాలనకు వ్యతిరేకంగా విరోచితంగా పోరాటం చేసి తరిమికొట్టారని, పేద ప్రజలకు అండగా నిలిచి దోపిడి పాలనకు వ్యతిరేకంగా భారత మాత ఉక్కు సంకెళ్లను తెంచడానికి ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేశారని అన్నారు. పాపన్న గౌడ్ తెలంగాణ ప్రాంతంలోని జనగామ జిల్లా కిలాసపూర్ గ్రామంలో సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టి చిన్నతనంలోనే పెత్తందారు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను స్ఫూర్తిగా తీసుకొని రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్,కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు,జిఎస్పిఎస్ అధ్యక్షుడు ధీకొండ శ్రీనివాస్,కెఎస్ పిఎస్ అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్,ప్రధాన కార్యదర్శి కె.మహేష్ కుమార్ గౌడ్,ఎస్ఎస్ పిజిఏ అధ్యక్షుడు చీకటి అశోక్ గౌడ్,అధ్యక్షుడు నిమ్మల శేఖర్ గౌడ్,సంఘం నాయకులు చామకూరి ఐలయ్య గౌడ్, చీకటి శ్రీనివాస్, మోడం వెంకన్న, గుణగంటి మోహన్, అనపురం వెంకన్న,సోమయ్య గౌడ్,శోభన్ బాబు,నిమ్మల వెంకన్న, జలగం రామ్మూర్తి గౌడ్, కోటగిరి కుమార్,తాళ్లపల్లి బిక్షం గౌడ్, మోడం సోమ నర్సయ్య, కుంభం జగన్నాథం,కొయ్యడ సాంబశివ, మెరుగు రమేష్,ఊడుగుల రాజ్ కుమార్, దీకొండ మధు, పెరుమాండ్ల రవి, మహేష్ గౌడ్, గట్టు కమలాకర్,జలగం రవి, పనస ప్రవీణ్ గౌడ్,ఎల్లా గౌడ్, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో.. రక్తహీనతతో బాధపడుతున్నారా..?

# డేంజర్ జోన్ నుంచి బయటపడాలంటే ఇలా చేయండి

ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొవలసి వస్తోంది.. ముఖ్యంగా పేలవమైన జీవనశైలి, అనారోగ్యమైన ఆహారం.. పని ఒత్తిడి.. ఇవన్నీ రోగాల బారిన పడేలా చేస్తున్నాయి. శరీరానికి కావలసిన పోషకాలు, విటమిన్లు అందకపోతే.. ప్రమాదంలో పడినట్లే.. అందుకే.. తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలంటున్నారు వైద్య నిపుణులు.. అయితే, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మీ శరీరంలో తగినంత ఐరన్ ఉండటం చాలా ముఖ్యం. ఇనుము లోపం మీ ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడు చేస్తుంది. శరీరంలో విటమిన్లు పుష్కలంగా ఉండటానికి కొన్ని ఆహారాలను తీసుకోవాలి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకోండి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఇవి తినండి.. దానిమ్మ: శరీరంలో విటమిన్లు, ఖనిజాలు ఉండటం చాలా ముఖ్యం. వీటి లోపం వల్ల అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల అనేక రకాల సమస్యలు వస్తాయి. శరీరంలో ఐరన్ తక్కువగా ఉన్నప్పుడు, చాలా బలహీనత ఉంటుంది. ఐరన్ లోపం ఉన్నవారు ఆహారంలో దానిమ్మను చేర్చుకుంటే చాలా మంచిది.. దీనివల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడొచ్చు.. గుడ్డు: ఐరన్ లోపం ఉన్నవారు ఉదయం అల్పాహారంగా కూడా గుడ్లు తీసుకోవాలి. గుడ్లలో మంచి మొత్తంలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఐరన్ ఉంటాయి. దీని వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడదు.. గుడ్లలో విటమిన్ డి కూడా లభిస్తుంది. ఐరన్ లోపం ఉన్నవారు తప్పనిసరిగా గుడ్లు తినాలి. రెగ్యులర్ గా మీ ఆహారంలో ఒక గుడ్డును చేర్చుకోండి.. బీట్‌రూట్: రోజూ బీట్‌రూట్ తీసుకోవడం వల్ల మీ శరీరంలోని రక్తహీనత తొలగిపోతుంది. ఇనుము లోపం నయమైతే, అనేక వ్యాధులు కూడా నయమవుతాయి. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించవచ్చు.. బీట్‌రూట్ తినడం వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. ఇది మీ కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా చాలా సహాయపడుతుంది. పాలకూర: పాలకూరలో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. పాలకూరలో కాల్షియం, సోడియం, ఖనిజ లవణాలు, క్లోరిన్, ఫాస్పరస్, అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరాన్ని ఇనుము లోపం నుంచి దూరంగా ఉంచుతాయి. ఇంకా ఒత్తిడిని తగ్గించడం ద్వారా మీ శరీరాన్ని రిలాక్స్ చేయడంలో కూడా ఇవి సహాయపడతాయి. పండ్లు కూరగాయలు: తాజా పండ్లు, కూరగాయలు మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. తాజా, పండ్లు కూరగాయల్లో ఐరన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. కావున వీటిని ప్రతిరోజూ తింటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు..

# సైబర్ జాగ్రత్త దివాస్ కార్యక్రమం

**- కమాన్పూర్ఎస్సై కొట్టే ప్రసాద్ నిర్వహించడమైంది**



**కమాన్పూర్ (ది క్రైమ్ న్యూస్ ): ఏప్రిల్ 2:** న్యూస్ ఈరోజు సైబర్ జాగృత్త దివాస్ ప్రోగ్రాం సందర్భంగా ఎస్సై కొట్టే ప్రసాద్ కమాన్పూర్ మరియు వీరి సిబ్బంది అయినా హెడ్ కానిస్టేబుల్ %u%.బాబు కానిస్టేబుల్స్ శంకర్, సరిత, రమీజ్ ల యుక్తంగా జడ్పీ హైస్కూల్ కమాన్పూర్‌లో విద్యార్థులను ఉద్దేశించి అవగాహన కార్యక్రమం నిర్వహించబడినది. ఇట్టి కార్యక్రమంలో సైబర్, షీ టీం,డయల్ 100, గంజాయి, ట్రాఫిక్ రూల్స్, ఈవ్ టీజింగ్ ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగినది.

# మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**ముత్తారం.ఏప్రిల్.02.( ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం మైదంబండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బియ్యని రాజు ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందిన అనంతరం ఇంటికి వచ్చిన రాజును మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోతిపెద్ది కిషన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్ రావు,మాజీ సింగల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలి



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ కి స్థానం కల్పించాలనీ లేకుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన బంజారా విద్యార్థి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ జేఏసీ నాయకుడు రాజ్ కుమార్ నాయక్ ని బుదవారం తెల్లవారుజామున మహబూబాద్ జిల్లా తొర్రూరు మండలం టిక్య తండాలో నిర్బంధంగా అరెస్టు చేసి తొర్రూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా రాజకుమార్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బంజారాలు దాదాపుగా 30 లక్షలు జనాభా కలిగివున్నా మంత్రి పదవి ఇవ్వకపోవడం తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు.

# ఈ ఎం టిల సేవలు అభినందనీయం

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్**



**ధర్మపురి, ఏప్రిల్ 2, (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల సేవలు అభినందనీయమని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ అన్నారు. బుధ వారం జాతీయ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మాత శిశు సంరక్షణ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని 108 లో పనిచేసే సిబ్బంది అందిస్తున్న సేవలను కొనియాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందినీ శాలువాతో సత్కరించారు. రోడ్డుపై గాయపడిన క్షతగాత్రులను, డెలివరీ కోసం సిద్ధంగా ఉన్న గర్భిణీ స్త్రీలను, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తరలించడంలో పాముకాటు కు గురైన, గుండె నొప్పి వచ్చిన బాధితులకు ఆపత్కాలంలో ఆపద్బాంధవులుగా నిలిచి ఆసుపత్రిలో చేర్చి వారిని అడ్మిట్ చేసుకునేంతవరకు ఉండి సేవలందిస్తున్నారనీ, మానవసేవయే మాధవసేవ అని పేర్కొన్నట్లుగా పనిచేస్తున్నారని అభినందించారు. మీకు ఎల్లవేళలా తోడ్పడు అందించడానికి సిద్ధంగా ఉన్నామని మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రీనివాస్, 108 జిల్లా కోఆర్డినేటర్ రాము, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఇంచార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ కుమారస్వామి,ఆరోగ్య విద్యా బోధకులు కటుకం భూమేశ్వర్ ,తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు రాజేశం, శ్రీధర్ 108 సిబ్బంది పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

# ముంబై ఇండియన్స్ బస్సులో హల్‌చల్ చేసిన జాస్మిన్ వాలియా

జాస్మిన్ వాలియా రోజ్.. ఇప్పుడు క్రికెట్ వీధుల్లో ఈ పేరే చర్చనీయాంశమౌతోంది. ప్రముఖ బ్రిటీష్ రియాలిటీ షో ది ఓన్లీ వే ఈజ్ ఎస్సెక్స్ ఫేమ్ అయిన జాస్మిన్ ఇటీవల టీమ్ ఇండియా క్రికెటర్, ముంబై ఇండియన్స్ సారధి హార్దిక్ పాండ్యాతో చెట్టపట్టాలేసుకుని తిరుగుతోంది. ముంబై ఇండియన్ సారధి హార్దిక్ పాండ్యా కొత్త గర్ల్ ఫ్రెండ్ ఇప్పుడు నాయిస్ క్రియేట్ చేస్తోంది. ఐపీఎల్ మ్యాచ్‌లలో సందడి చేస్తోంది. హార్దిక్ పాండ్యా ఎక్కడ ఆడుతుంటే అక్కడికి వాలిపోతోంది. నిన్న సోమవారం జరిగిన కేకేఆర్ వర్సెస్ ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో తళుక్కుమంది. అంతేకాకుండా కేకేఆర్ జట్టుపై విజయం తరువాత ఆ టీమ్ బస్సులో ప్రత్యక్షమైంది. స్టాండ్స్ నుంచి ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు సపోర్ట్ చేస్తూ చిల్ చేసింది. దుబాయ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ 2025 లో కూడా జాస్మిన్ వాలియా ఫోటోలు, వీడియో తొలిసారిగా సోషల్ మీడియాలో వైర్ అయ్యాయి. స్ట్రైప్డ్ షర్ట్, నెర్డీ గ్లాస్‌లో హల్‌చల్ చేయడంతో ఇద్దరి మధ్య బంధంపై వస్తున్న పుకార్లకు బలం చేకూరింది. ఇద్దరూ తమ తమ సోషల్ మీడియా వేదికల్లో ఒకే రకమైన ఫోటోలు షేర్ చేయడాన్ని గమనించిన ఫ్యాన్స్ పుకార్లు ప్రారంభించారు. ఇద్దరూ గ్రీస్‌లో వెకేషన్ గడిపారనే వార్తలు కూడా వచ్చాయి. ఈ ఇద్దరూ షేర్ చేసిన ఫోటోల్లో బ్యాక్‌డ్రాప్ గ్రీస్ నేపథ్యం ఉండటం దీనికి కారణం. గత ఏడాది 2024 జూలైలో విడిపోతున్నట్టుగా హార్దిక్ పాండ్యా, నతాషా స్టాన్ కోవిక్ ప్రకటించాక హార్దిక్ వర్సెస్ జాస్మిన్ బంధంపై పుకార్లు మొదలయ్యాయి. నాలుగేళ్లు కలిసి ఉన్న తరువాత ఇద్దరూ అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని, కలిసి ఉండాలని చాలా ప్రయత్నించినా సాధ్యం కాలేదని ఇది కఠిన నిర్ణయమైనా తప్పడం లేదని ఇద్దరూ ప్రకటించారు. ఇప్పుడు హార్దిక్ పాండ్యాతో తిరుగుతున్నట్టుగా భావిస్తున్న కొత్త గర్ల్ ఫ్రెండ్ జాస్మిన్ వాలియా రోజ్ తమ బంధాన్ని క్లియర్ చేసేసింది. కేకేఆర్ జట్టుపై విజయం తరువాత ముంబై ఇండియన్స్ టీమ్ బస్ ఎక్కి హల్‌చల్ చేసింది. జాస్మిన్ వాలియా రోజ్ బ్రిటీష్ రియాలిటీ షో ది ఓన్లీ వే టు ఎస్సెక్స్‌తో ఫేమ్ తెచ్చుకుంది. 2017లో హిట్ అయిన బోమ్ డిగ్గీ విత్ జాక్ నైట్ పాటతో ప్రాచుర్యం పొందింది. బిగ్‌బాస్ 13 ఫైనలిస్ట్ ఆసిమ్ రియాజ్‌తో కలిసి 202లో నైట్స్ ఎన్ ఫైట్స్ మ్యూజిక్ వీడియో విడుదల చేసింది.






## రాజస్థాన్ ఖాతాలో ఎట్టకేలకో విజయం

రాజస్థాన్ రాయల్స్‌కు ఎట్టకేలకు ఓ శుభవార్త అందింది. ఐపీఎల్ 2025 లో కెప్టెన్, వికెట్ కీపర్ గా బాధ్యతలు స్వీకరించేందుకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంజూ శాంసన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శాంసన్ వేలికి గాయం, శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్న తర్వాత ఈ నిర్ణయం వచ్చింది. శాంసన్ ఇప్పుడు తొలిసారిగా ఐపీఎల్ 2025లో రాజస్థాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ సమయంలో, ఏప్రిల్ 5న పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో అతను జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో మొదటి మూడు మ్యాచ్‌లకు శాంసన్ బ్యాట్స్‌మన్‌గా ఆడేందుకు మాత్రమే అనుమతి ఉంది. ఈ కాలంలో, అతను వికెట్ కీపింగ్, కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. ఇటువంటి పరిస్థితిలో శాంసన్ కేవలం ఒక ఆటగాడిగా మాత్రమే మ్యాచ్ ఆడుతున్నాడు. ఇంతలో, రియాన్ పరాగ్‌ను జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. కానీ, ఇప్పుడు శాంసన్ ఎన్‌సీఏ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. అతను ఇకపై రాయల్స్ తరపున వికెట్ కీపింగ్‌తో పాటు కెప్టెన్‌గా కనిపించేందుకు రెడీ య్యాడు.ఇంపాక్ట్ ప్లేయర్‌గా, శాంసన్ బ్యాట్‌తో బాగా రాణించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 66 పరుగులు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 13 పరుగులు, చెన్నై సూపర్ కింగ్స్‌పై 20 పరుగులు చేశాడు. శాంసన్ లేనప్పుడు, ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శాంసన్ ఐపీఎల్‌లో 4500 పరుగులు పూర్తి చేశాడు. దీంతో ఐపీఎల్‌లో 14వ ఆటగాడిగా నిలిచాడు. శాంసన్ 2013లో ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు అతను 171 మ్యాచ్‌లు ఆడాడు. రాజస్థాన్ రాయల్స్ గురించి చెప్పాలంటే, రాయల్స్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. ఆ జట్టు మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి, ఆ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్‌పై గెలిచింది. శాంసన్ కెప్టెన్‌గా ఆడితే జట్టు వ్యూహంలో ఖచ్చితంగా తేడా ఉంటుందని అంతా భావిస్తున్నారు.

## పంత్ పై గోయెంకా సీరియస్

### పంజాబ్ చేతిలో ఘోర ఓటమితో చురకలు

మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్?తో జరిగిన మ్యాచ్?లో పంజాబ్ కింగ్స్? 8 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. దీంతో ప్రస్తుత సీజన్?లో పంజాబ్ వరుసగా రెండో విజయం నమోదు చేయగా, లఖ్?నవూకు మూడు మ్యాచ్?ల్లో రెండో ఓటమి. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం లఖ్?నవూ కెప్టెన్ రిషభ్? పంత్ ఆ ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గోయెంకా మధ్య సంభాషణ వైరల్‌గా మారింది. ఈ ఇద్దరి మధ్య చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్?గా మారింది. తాజా ఓటమి తర్వాత పంత్? పట్ల సంజీవ్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పంత్?ను మైదానంలో అందరిముందే జట్టు ఓటమికి గల కారణాలు అడిగినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోల్లో కనిపిస్తోంది. దీంతో లఖ్?నవూ ప్రదర్శన పట్ల సంజీవ్ సంతృప్తిగా లేరని, అందకే పంత్?ను సీరియస్ మందలించారని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అంతేకాకుండా అతడనికి బాగా తిట్టి ఉంటాడని అభిప్రాయపడుతున్నారు.అయితే జట్టు ఓటమి పట్ల సంజీవ్ ఇలా ప్రవర్తించడం కొత్తేమీ కాదు. గతేడాది సన్?రైజర్స్? హైదరాబాద్?తో లఖ్?నవూ ఓడిన తర్వాత అప్పటి కెప్టెన్ రాహుల్? పట్ల కూడా సంజీవ్ ఇలాగే ప్రవర్తించారు. మైదానంలో అందరిముందే రాహుల్?పై కోపం ప్రదర్శిచారు. అప్పట్లో ఈ వీడియో ఫుల్ వైరల్ అయ్యింది. తాజాగా మరోసారి తమ కెప్టెన్?తో ఇలా సీరియస్?గా మాట్లాడాడం వల్ల 'అప్పటి సీన్ రీ క్రియేషన్ చేశారు' అంటు నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు.





## ప్రభ్‌సిమ్రాన్ సింగ్ కు హగ్‌తో ఆకాశానికెత్తిన ప్రీతిజింటా

ఐపీఎల్ 2025 లో భాగంగా 13వ మ్యాచ్ లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ మధ్య జరిగింది. లక్నోలోని ఎకానా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో టీం 172 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో లక్నో బౌలర్లపై విధ్వంసం సృష్టించాడు. అతను కేవలం 34 బంతుల్లో 202 స్ట్రైక్ రేట్‌తో 69 పరుగులు చేశాడు. ఈ సమయంలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఒక ఫోర్ కొట్టడం అందరికీ లగాన్ సినిమాను గుర్తు చేసింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఇన్నింగ్స్ మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది మాత్రమే కాదు, ఈ ఇన్నింగ్స్‌లో, ప్రభ్‌సిమ్రాన్ లక్నోలో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ సాధించిన రికార్డును కూడా సృష్టించాడు. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతిజింటా నుంచి ఓ హగ్ కూడా అందుకున్నాడు. దీంతో ఈ ఫొటో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. పంజాబ్ కింగ్స్ తరపున ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ మొదటి ఓవర్లోనే 1 ఫోర్, 1 సిక్స్ కొట్టడం ద్వారా తన వైఖరి ఏంటో చూపించాడు. ఆ తరువాత ఏమాత్రం ఆగలేదు. సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపించాడు. ఈ విధంగా అతను కేవలం 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. దీంతో అతను లక్నో మైదానంలో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ సాధించిన రికార్డును కూడా సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు ఎకానా స్టేడియంలో 27 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన సునీల్ నరైన్ పేరిట ఉంది. హాఫ్ సెంచరీ తర్వాత కూడా ప్రభ్‌సిమ్రాన్ ఆగలేదు. కానీ, 11వ ఓవర్‌లో 69 పరుగులు చేసిన తర్వాత దిగ్వేష్ సింగ్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌లో ప్రభ్‌సిమ్రాన్ 3 సిక్సర్లు, 9 ఫోర్లు కొట్టాడు. వాటిలో అచ్చం లగాన్ సినిమాలో లాగా ఒక ఫోర్ ఉండడం గమనార్హం. నిజానికి, 8వ ఓవర్లో అతను రవి బిష్ణోయ్ వేసిన బంతికి ఆఫ్ స్టంప్ వైపు షఫుల్ అయ్యాడు. ఆ తర్వాత బిష్ణోయ్ అదే లైన్‌లో ఫుల్ టాస్ వేశాడు. దానిపై ప్రభ్‌సిమ్రాన్ సులభంగా స్కూప్ షాట్ ఆడి ఫోర్ కొట్టాడు. ఈ షాట్ లగాన్ సినిమా లాగానే ఉంది. వ్యాఖ్యాతలు కూడా దీనిని ప్రస్తావించారు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ తరపున ప్రభ్‌సిమ్రాన్ సింగ్ అతిపెద్ద హీరోగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్ జట్టు విజయాన్ని ఎంతో ఈజీ చేసింది. 172 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ కేవలం 98 బంతుల్లోనే ఛేదించింది. అయితే, ఇదంతా ప్రీతి జింటా ఆత్మవిశ్వాసం ఫలితమే. అయితే, జట్టు ఓనర్ ప్రీతి జింటా మాత్రం అతనిపై నమ్మకం వ్యక్తం చేసి వరుసగా 6 సీజన్ల పాటు అతనిని జట్టులో ఉంచింది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ఫ్రాంచైజీ దిగ్గజాలను విడుదల చేసింది. కానీ, ప్రీతి జింటా అతన్ని రూ. 4 కోట్ల ధరకు రిటైన్ చేసుకుంది. నేడు ప్రభ్‌సిమ్రాన్ ఆమె నమ్మకాన్ని నిలబెట్టాడు. దీంతో ప్రీతిజింటా హగ్‌తో విషెస్ తెలిపింది.

## అనికేత్ వర్మకు హార్దిక్ స్ఫూర్తి

2025 ఐపీఎల్?లో సన్?రైజర్స్? హైదరాబాద్? జట్టు నుంచి యంగ్ ప్లేయర్? అనికేత్ వర్మ వెలుగులోకి వచ్చాడు. ఈ 23ఏళ్ల కుర్రాడు అదిరే ఆటతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. రీసెంట్?గా దిల్లీ క్యాపిటల్స్?పై అనికేత్ 41బంతుల్లోనే 74 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అంతకుముందు లఖ్?నవూపై 276 స్ట్రైక్?రేట్?తో విరుచుకుపడ్డాడు. దీంతో ఒక్కసారిగా అనికేత్?కు ఫుల్ క్రేజ్ వచ్చింది. అయితే స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్య అతడికి స్ఫూర్తిగా నిలిచాడని అనికేత్ అంకుల్ అమిత్ వర్మ వెల్లడించారు. తాను నాలుగేళ్లపాటు మ్యాగీ న్యూడిల్స్ తినే క్రికెట్ ప్రాక్టీస్‌కు వెళ్లినట్లు హార్దిక్? గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పాడు. ఇంటర్వ్యూల్లో హార్దిక్? మాటలు విన్న అనికేత్ కెరీర్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రిపేర్ అయినట్లు అమిత్ పేర్కొన్నారు.'అనికేత్‌కు 14ఏళ్లు ఉన్నప్పుడు, ఈ న్యూస్ పేపర్‌లో ఓ వార్త చదివాను. ఓరోజు అకాడమీకి వెళ్తున్నప్పుడు అదే స్టోరీని అనికేత్‌కు చెప్పా. అప్పుడే అనికేత్‌లో ఆట పట్ల ప్యాషన్, పరుగుల దాహాన్ని నేను గమనించాను. కీలక ఆటగాడిగా మారతాడని అప్పుడే భావించా. ఒకసారి స్టేడియం చేరుకున్నాక, నా పాదాలను తాకిన అనికేత్ 'కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకొస్తున్నా' అని చెప్పాడు. అప్పుడు నేను నవ్వాను. కానీ, అతడు మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు. హార్దిక్ పాండ్య ఐపీఎల్‌లోకి డెబ్యూ చేసిన తర్వాత జాతీయ జట్టులోకి వచ్చాడు. అలాగే ఏదొక రోజు అనికేత్ కూడా ఆ స్థాయికి చేరతాడని అనుకుంటున్నాను' అని అమిత్ వెల్లడించారు. కాగా, ఉత్తర్?ప్రదేశ్? ఝాన్సీకి చెందిన అనికేత్ మధ్యప్రదేశ్? తరపున దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఐపీఎల్?లోకి రాకముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడాడు. మధ్యప్రదేశ్ ప్రీమియర్ లీగ్–%వీస్తూా% 200పైగా స్ట్రైక్?రేట్?తో బ్యాటింగ్ చేసి అనికేత్ ఔరా అనిపించాడు. భోపాల్ లెపార్డ్స్? తరపున ప్రాతినిధ్యం వహించిన ఈ కుర్రాడు 32 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. ఇలా వెలుగులోకి వచ్చిన అనికేత్?ను సన్?రైజర్స్ గతేడాది జరిగిన మెగా వేలంలో? రూ.30లక్షల బేస్? ప్రైస్?కు కొనుగోలు చేసింది.

# విమర్శలకు సమాధానమిచ్చిన జడేజా..

ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ లో కాస్త స్ట్రగుల్ అవుతోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్ ల్లో కేవలం ఒక్క మ్యాచ్ లో మాత్రమే గెలిచింది. ఇక చివరి రెండు మ్యాచ్ ల్లో పరాజయం పాలైంది. ముఖ్యంగా వెటరన్లు ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు మ్యాచ్ ల్లో గెలిచే ఇంటెంట్ లేకుండా ఆడారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ తో ధోనీ తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ కు రావడంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా రవీంద్ర జడేజా ఈ విమర్శలకు సమాధానం అన్నట్లుగా ఒక పోస్టును షేర్ చేశాడు. తాజాగా ఈ పోస్టు నిమిషాల్లో సోషల్ మీడియాలో వైరలైంది. క్రికెట్ అభిమానులు తమకు తోచిన కామెంట్లు పెడుతూ, లైకులు, షేర్లు చేస్తూ వైరల్ చేశారు. ఇంతకీ ఆ పోస్టులో ఏముందంటే.. ప్రస్తుతమున్న గడ్డు కాలం తొలిగిపోతుందనే ఆశాభావ దృక్పథంతో పోస్టు చేశాడు. ఈ సీజన్ లో బ్యాటింగ్ ఆర్డర్ లో విఫలం కావడం చెన్నైని దెబ్బతీస్తోంది. ముఖ్యంగా ఓపెనర్ రచిన్ రవీంద్ర, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ లపై ఎక్కువగా ఆధారపడుతోంది. వాళ్లిద్దరూ ఆడితేనే ప్రభావవంతంగా కనబడుతోంది. ఇక బ్యాటింగ్ లైనప్ లో మార్పులు చేర్పులు ఆ జట్టుకు శాపంగా మారాయి. ముఖ్యంగా రాహుల్ త్రిపాఠిని ఓపెనర్ గా దించడం, కివీస్ ఓపెనర్ డేవన్ కాన్వేను బెంచ్ కే పరిమితం చేయడం.. మిడిలార్డర్ విఫలం కావడం, అయినా కూడా ఆటగాళ్లను మార్చకపోవడం తదితరాలు చెన్నైకి శాపమయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నాయి. బ్యాటింగ్ ఆర్డర్ లో మార్పులు చేస్తేనే చెన్నై రాణించగలుగుతుందని భారత క్రికెటర్ చటేశ్వర్ పుజారా వ్యాఖ్యానించాడు. ముఖ్యంగా ఓపెనర్ గా త్రిపాఠిని ఆడించడం సరికాదని, అతని స్థానంలో కాన్వేను దించాలని సూచించాడు. అలాగే ఓవర్సీస్ ఆటగాళ్ల ఎంపికలో మరింత తెలివిగా వ్యవహరించాలని పేర్కొన్నాడు. టీమ్ మేనేజ్మెంట్ వీలైనంత త్వరగా కుదురైన బ్యాటింగ్ లైనప్ ముందుకు రావాలని పేర్కొన్నాడు. మిడిలార్డర్లోని శివమ్ దూబే, దీపక్ హూడా, శామ్ కరన్ స్థాయికి తగ్గట్లు రాణించాలని సూచించాడు. అప్పుడే జట్టు ఎక్కువగా విజయాలు సాధిస్తుందని పేర్కొన్నాడు. ఇక చెన్నై టీమ్ ఆట కూడా సాధారణంగా ఉందని, 160–170 పరుగులను ఛేజ్ చేస్తోందని, 170 పరుగుల టార్గెట్ ను డిఫెండ్ చేసుకుంటోందని గుర్తు చేశాడు. అయితే మిగతా జట్లు దూకుడే మంత్రంగా ఆడుతున్న నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు కూడా ఆటతీరులో మార్పు చేసుకోవాలని తెలిపాడు. అప్పుడే ఆ జట్టు విజయాల బాట పడుతుందని, మరింత బలంగా పుంజుకోగలదని పుజారా వ్యాఖ్యానించాడు. ఇక చెన్నై తన తదుపరి మ్యాచ్ ను ఈనెల 5న ఢిల్లీ క్యాపిటల్స్ తో ఆడనుంది. చివరి మ్యాచ్ లో సన్ రైజర్స్ పై ఢిల్లీ ఘన విజయం సాధించింది.



# విశ్వజ

## తాటి ముంజలు తింటే భలే ఆరోగ్య ప్రయోజనాలు..
# అసలే వదిలిపెట్టరు!



సమ్మర్ సీజన్లో దొరికే తాటి ముంజల వలన బోలెడు ఉపయోగాలు ఉంటాయి. తాటి ముంజలు చూడటానికి జెల్లీలా, మృదువుగా ఉంటాయి. ఏప్రిల్ నెల నుండి మొదలుకొని మే నెల చివరి వరకు తాటి ముంజలు మనకు పుష్కలంగా దొరుకుతాయి . ఎలాంటి కల్తీలేని పకృతి వరప్రసాదాయిని ఏదైనా ఉంది అంటే అది తాటి ముంజలే. తాటి ముంజలు తినడం వలన మీ కడుపు త్వరగా చల్లబడుతుంది తాటి ముంజలలో మన శరీరానికి కావాల్సిన బోలెడు పోషకాలు ఉంటాయి. ఎండాకాలంలో చెమటతో త్వరగా డిహైడ్రేషన్ అయ్యేవారికి తాటి ముంజలు శరీరం హైడ్రేట్ అయ్యేలా చేస్తాయి. వర్క్ రీత్యా ఎక్కువగా బయట గడిపేవారు రోజుకు బాడీకి సరిపోయేంత మంచి నీరు తాగకపోవడం వలన కిడ్నీలలో రాళ్ళు ఏర్పడతాయి. ఈ సమస్య ఉన్నవాళ్ళకు కూడా తాటి ముంజలు దివ్యౌషధం. తాటి ముంజలతో బరువుకు చెక్ కడుపులో మంట, మూత్ర విసర్జన సమయంలో పొత్తికడుపులో భరించలేని నొప్పితో బాధ పడేవారు క్రమం తప్పకుండా ఒక పదిహేను రోజులు పాటు లేత ముంజలను తినాలి. ఇక తాటి ముంజలలో శరీరానికి కావాల్సిన ఏ, బీ, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియంవంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. తాటి ముంజలు మన శరీర బరువు తగ్గటానికి ఎంతగానో దోహదం చేస్తాయి. తాటి ముంజలతో శరీరానికి శక్తి తాటి ముంజలు కాలేయ సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. ఈ ముంజలలో అధిక మొత్తంలో ఉండే పొటాషియం మన శరీరంలో ఉండే విష పదార్థాలను తొలగిస్తుంది. తాటి ముంజలు మన శరీరానికి కావాల్సిన శక్తిని ఇచ్చి అలసటను తగ్గిస్తాయి. ఇక ఎండాకాలంలో చాలా వేడి చేసి ఇబ్బంది పడే వారు తాటి ముంజలను తింటే శరీరం చల్లబడుతుంది. శరీరానికి చలువ చేకూర్చే తాటి ముంజలను ఐస్ యాపిల్ అని కూడా పిలుస్తారు. తాటికల్లు ఆరోగ్య అద్భుతాలు తక్కువేం కాదు.. కానీ ఇది గుర్తు పెట్టుకోండి! తాటి ముంజలు సమ్మర్ లో చాలా అవసరం తాటి ముంజలలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. శరీరానికి మేలు చేసే పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వేసవి కాలంలో మన శరీరం నుండి చెమట బయటకు పోతుంది. శరీరంలోని పోషకాలు చెమట రూపంలో బయటకు పోతాయి. వాటిని భర్తీ చేయటానికి తాటి ముంజలు ఎంతో అవసరం.



## రోజంతా ఏసీలో ఉంటున్నారా? అయితే ఈ జబ్బులకు మీరే బాధ్యులు!

ఎండాకాలం వచ్చేసింది. బయట తీవ్రమైన ఎండలు దాటికి బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్న వారు ఏసీ గదులకు పరిమితం అవుతున్నారు అయితే ఎక్కువగా ఏసిన వినియోగిస్తే అనారోగ్యాల బారిన పడటం ఖాయం అనే విషయాన్ని ఒకరు కచ్చితంగా తెలుసుకోవాలి. అసలు ఎక్కువగా ఏసీ ని ఉపయోగిస్తే వచ్చే దుష్ప్రభావాలు ఏమిటి? మన ఆరోగ్యం ఏవిధంగా పాడవుతుంది అనే విషయాలను ప్రస్తుతం తెలుసుకుందాం ఏసీలో ఉంటే ఈ అనారోగ్యాలు ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారం రోజులనుండి వాతావరణంలో చోటుచేసుకుంటున్న పెనుమార్పులు కారణంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటటంతో ఒకసారిగా వాతావరణం హీటెక్కిపోతుంది. ఈ వాతావరణానికి తట్టుకోలేక ఏసీ గదుల్లోనే ఎక్కువగా గడుపుతున్నారు అలా రోజంతా ఏసీ గదుల్లో ఉండటం వలన ఆరోగ్య సమస్యలు అధికమవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులున్న వారికి , అస్తమా ,ఊబకాయం ఉన్నవారికి ఆరోగ్యం మరింతగా క్షీణిస్తుంది. ఎక్కువసేపు ఏసీ గదుల్లో ఉంటే నరాల బలహీనత ప్రతి మనిషి శరీరంలో మినిమం 20 డిగ్రీల వేడి వుంటుంది. సహజంగా వాతావరణంలో 20 డిగ్రీల నుండి 25 డిగ్రీలు ఉష్ణోగ్రత ఉంటే మనం తట్టుకోగలము .. అంటే మన శరీరానికి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు అవసరం అలా కాకుండా గదిలో ఎక్కువగా లేదా సాధారణంగా ఏసీ వేసుకొని నిద్రపోతే బాడీ ఎక్కువగా చల్లగా మారి కాళ్లు,చేతులు తిమ్మిర్లుగా మారే ఛాన్స్ ఉంటుంది. ఏసీలో ఎక్కువ ఉంటే తలనొప్పి ఎక్కువగా ఏసీ గదుల్లో ఉండటం వలన శరీరంలోని కండరాల పనితీరు తగ్గుతుంది. నరాలలో రక్త ప్రసరణ మందగిస్తుంది. కాబట్టి నరాలు బలహీనంగా మారుతాయి.. సాధారణంగా ఆరుబయట చలి గాలిలో తిరిగే వారికి రానటువంటి జబ్బులు ఏసీ గాలితో వెంటనే వచ్చేస్తాయి. తల తిప్పడం మొదలుకొని ,వాంతులు చేసుకునే వరకు వారిపై ఏసీ ప్రభావం చూపుతుంది . చాలా మందిలో తలనొప్పి మొదలౌతుంది. ఏసీ ఎక్కువ వాడితే శరీరం డీ హైడ్రేషన్ కొంతమందిలో ఏసీ ని ఎక్కువగా ఉపయోగించడం వల్ల శరీరం డీహైడ్రేషన్ కు గురవుతుంది. చర్మం పొడి పాడటం, చర్మం దురదగా మారడం వంటివి చోటు చేసుకుంటాయి. ఎక్కువసేపు ఏసీలో ఉంటే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అంతేకాదు ఏసీ గాలి వల్ల మెదడు కణాలు బలహీనపడి మెదడు సామర్థ్యం, పనితీరు దెబ్బతింటుంది. నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారా? అయితే వెంటనే వీటిని తినండి! కీళ్ళ నొప్పులు, కళ్ళపైన ఏసీ ప్రభావం ఇక కీళ్ల నొప్పులు వంటి సమస్యలతో బాధపడేవారు ఏసీలో ఉండడం వల్ల బాడీ పెయిన్స్ తో పాటు కీళ్లనొప్పులు బాధిస్తాయి. ఏసీలో ఉంటే కీళ్ళ నొప్పుల సమస్య మరింత పెరుగుతుంది. ఏసీలో ఉండడం వల్ల కళ్ళు కూడా ప్రభావితమవుతాయి. కళ్ళు పొడిబారి ఇబ్బందికి గురవుతాయి. కనుక ఎండాకాలంలో ఏసీ వినియోగం ఎక్కువ మంచిది కాదు.

## ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయా?
# ఇంకెన్ని సమస్యలు వస్తాయో తెలుసా?



ఖర్జూరం.. తీయటి రుచికి, మెత్తటి స్పర్శకు మారుపేరు. ఎడారి ప్రాంతపు బంగారంగా పిలువబడే ఈ ఫలం ఎన్నో పోషక విలువలతో నిండి ఉంటుంది. తక్షణ శక్తిని అందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తహీనతను తగ్గించడంలో ఖర్జూరం ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే చాలామంది ఖర్జూరాన్ని తమ ఆహారంలో భాగంగా చేసుకుంటారు. అయితే, కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు ఖర్జూరానికి దూరంగా ఉండటం లేదా పరిమితంగా తీసుకోవడం మంచిది. లేదంటే కొన్ని ప్రతికూల ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎవరు ఆ ఖర్జూరం తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.. రక్తంలో చక్కెర స్థాయిల పెంపు: ఖర్జూరంలో సహజ చక్కెరలు (ఫ్రక్టోజ్, గ్లూకోజ్) అధికంగా ఉంటాయి. మధుమేహం ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ఇది వారి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. ఒకవేళ తినాలనిపిస్తే, వైద్యుల సలహా మేరకు చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. వారి డైట్‌లో భాగంగా ఇతర ఆహారాలను బ్యాలెన్స్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ఖర్జూరంలో కేలరీలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఒక సాధారణ సైజు ఖర్జూరంలో సుమారు 20-25 కేలరీలు ఉంటాయి. అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నవారు ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల వారి బరువు మరింత పెరిగే అవకాశం ఉంది. బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నవారు ఖర్జూరానికి దూరంగా ఉండటం లేదా చాలా తక్కువ మొత్తంలో తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ తీసుకోవాలనుకుంటే, వారి రోజువారీ కేలరీల లెక్కల్లో దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. మూత్రపిండాల సమస్యలు పెంపు. ఖర్జూరంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన వ్యక్తులకు ఇది మంచిదే అయినప్పటికీ, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు లేదా హైపర్‌కలేమియాతో బాధపడుతున్నవారు ఎక్కువ పొటాషియం తీసుకోవడం ప్రమాదకరం. వారి శరీరంలోని మూత్రపిండాలు అదనపు పొటాషియంను సమర్థవంతంగా తొలగించలేవు. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఇలాంటి సమస్యలు ఉన్నవారు ఖర్జూరం తినే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి. జీర్ణ సంబంధిత సమస్యలు.. కొంతమందికి ఖర్జూరం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్ లేదా ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తవచ్చు. ఖర్జూరంలోని అధిక ఫైబర్ కంటెంట్ మరియు కొన్ని సహజ చక్కెరలు కొందరికి సరిపడకపోవచ్చు. ముఖ్యంగా ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలు ఉన్నవారు ఖర్జూరం తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ ఖర్జూరం తిన్న తర్వాత అసౌకర్యంగా అనిపిస్తే, దానిని పూర్తిగా మానేయడం మంచిది. సార్బిటాల్ అలర్జీ: ఖర్జూరంలో సార్బిటాల్ అనే ఒక రకమైన చక్కెర ఆల్కహాల్ ఉంటుంది. కొంతమందికి ఈ సార్బిటాల్ పడకపోవచ్చు లేదా దాని వల్ల అలర్జీ వచ్చే అవకాశం ఉంది. అలాంటివారు ఖర్జూరం తింటే కడుపు నొప్పి, విరేచనాలు లేదా ఇతర అలర్జిక్ రియాక్షన్స్ ఎదుర్కొనే అవకాశం ఉంది. సార్బిటాల్ అలర్జీ ఉన్నట్టు తెలిసినవారు ఖర్జూరానికి దూరంగా ఉండాలి. ఖర్జూరం ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండు అయినప్పటికీ, ఈ ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు దానిని తినే ముందు ఒకసారి ఆలోచించడం లేదా వైద్యుడి సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. మీ శరీరం యొక్క అవసరాలను మీ ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకుని సరైన ఆహారం తీసుకోవడం ద్వారా మీరు ఆరోగ్యంగా ఉండగలరు. ఏదైనా ఆహారాన్ని తీసుకునే ముందు మీ ఆరోగ్య నిపుణుడిని సంప్రదించడం ఎల్లప్పుడూ మంచిది.


# మార్కెట్

## జీఎస్టీ వసూళ్లలో 10 శాతం వృద్ధి
### మార్చిలో రూ.1.96 లక్షల కోట్లు
### తెలంగాణలో సింగిల్ డిజిట్‌కు పరిమితమైన పెరుగుదల

న్యూఢిల్లీ : వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు భారీగా పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చిలో రూ.1.96 లక్షల కోట్లమేర వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైనదాంతో పోలిస్తే 10 శాతం పెరిగినట్టు తెలిపింది. అలాగే జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత రెండో అత్యధిక వసూళ్లు కూడా ఇదే కావడం విశేషం. వీటిలో దేశీయంగా జరిగిన లావాదేవీల ద్వారా రూ.1.49 లక్షల కోట్లు వసూలవగా, అలాగే దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్నుతో మరో రూ.46,919 కోట్లు సమకూరాయి. జీఎస్టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.38,145 కోట్లు వసూలు కాగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.49,891 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.95,853 కోట్లు, సెస్ రూపంలో మరో రూ.12,253 కోట్లు సమకూరినట్టు పేర్కొంది. అలాగే రూ.19,615 కోట్లు రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. ఏప్రిల్ 2024లో నమోదైన రూ.2.10 లక్షల కోట్లు ఇప్పటి వరకు ఇదే గరిష్ఠ స్థాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం(ఏప్రిల్ నుంచి మార్చి వరకు) రూ.22.08 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. తయారీ, వినిమయం అత్యధికంగా ఉన్న రాష్ట్రాలైన మహారాష్ట్ర, హర్యాన, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోగా..ఇతర రాష్ట్రాలైన గుజరాత్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు 1-7 శాతం మధ్యలో వృద్ధిని నమోదు చేసుకున్నాయి.




## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



సెన్సెక్స్ 600 పాయింట్లు జంప్..! రెండురోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్ రాణించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో పాటు మరికొన్ని దేశాలపై సుంకాలు ప్రకటించనునున్న నేపథ్యంలోనూ ర్యాలీ కొనసాగడం విశేషం. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 76,146.28 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,064.94 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 76,680.35 పాయింట్ల గరిష్ఠానికి పెరిగింది. చివరకు 592.93 పాయింట్లు పెరిగి 76,617.44 వద్ద ముగిసింది. నిఫ్టీ 166.65 పెరిగి 23,332.35 వద్ద స్థిరపడింది. దాదాపు 2755 షేర్లు లాభపడగా.. 1,048 పతనమయ్యాయి. ట్రంప్ టారిఫ్ ప్లాన్ ప్రకటించ తర్వాత ప్రపంచ వాణిజ్యం మొత్తం మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ ప్లాన్ల రూపురేఖలు ఎలా ఉంటాయో చూడాల్సిందేనని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. మనకు ఇబ్బందికరంగా మారింతే తిరోగమనాన్ని చూడాల్సి వస్తుందని.. ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ సీఈవో సందీప్ బాగ్లా పేర్కొన్నారు. రంగాలవారీగా, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, బ్యాంక్, ఐటీ, ఆటో ఏప్రిల్ షేర్లు ఒకశాతం వరకు పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ ఒకశాతంపైగా పెరిగాయి. నిఫ్టీ ఇన్‌ఫ్రా, మెటల్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ కూడా అదే బాటలో కొనసాగాయి. నిఫ్టీలో టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, జొమాటో (ఎటర్నల్), టైటాన్ కంపెనీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్ కార్ప్, నెస్లే, హిందాల్కో షేర్లు నష్టపోయాయి.


## యూపీఐ లావాదేవీల జోరు

న్యూఢిల్లీ : యూపీఏ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మార్చి నెల చివరినాటికి రూ.24.77 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయని ఎన్‌పీసీఐ వెల్లడించింది. అంతక్రితం నెలతో పోలిస్తే 12.7 శాతం పెరిగాయని తెలిపింది. ఫిబ్రవరిలో రూ.21.96 లక్షల కోట్లు లావాదేవీలు జరగగా.. క్రితం ఏడాది ఇదే నెలలో రూ.19.78 లక్షల కోట్లు జరిగాయి. విలువ పరంగా చూస్తే 25 శాతం అధికమయ్యాయని స్పైస్ మనీ ఫౌండర్, సీఈవో దిలీప్ మోదీ తెలిపారు.




## ఉపసంహరించుకున్న రూ.2వేల నోట్లపై ఆర్‌బీఐ కీలక ప్రకటన..!

రద్దు చేసిన రూ.2000నోట్లు మంగళవారం నాటికి 98.21 శాతం తిరిగి బ్యాంకులకు చేరాయని.. ఇంకా రూ.6,366 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఇండియా స్పష్టం చేసింది. 2023 మే 19న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్ల చెలామణిలో నుంచి ఉపసంహరించు కుంటున్నట్లు తెలిపింది. నోట్లను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించిన రోజు వరకు రూ.2వేల నోట్ల మొత్తం విలువ రూ.3.56లక్షల కోట్లుగా రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. మార్చి 2025తో ముగిసిన ఆర్థిక సంవత్సరం తర్వాత రూ.6,366 కోట్లు ఇంకా మార్కెట్‌లోనే ఉన్నాయని.. ఇప్పటి వరకు నోట్లలో 98.21 శాతం తిరిగి వచ్చినట్లు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. రద్దు చేసిన నోట్లను 2023 అక్టోబర్ 7 వరకు అన్ని బ్యాంకుల్లో రూ.2 వేల నోట్లను డిపాజిట్ చేయడం లేదంటే మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత ఆర్‌బీఐ రూ.2వేల నోట్లను సేకరిస్తున్నది. సామాన్య ప్రజలు దేశంలోని ఏ పోస్టాఫీసు నుంచైనా, ఇండియన్ పోస్ట్ ద్వారా భారతీయ రిజర్వ్ బ్యాంక్ కార్యాలయాల్లోనూ రూ.2000 నోట్లను పంపి తమ బ్యాంకు ఖాతాలో జమ చేసుకునే అవకాశం ఇస్తున్నది. రూ. 2000 బ్యాంకు నోట్లు చట్టబద్ధమేనని ఆర్‌బీఐ పేర్కొంది.



# ప్రకాశం జిల్లాను గుండెల్లో పెట్టుకుంటాం

### అభివృద్ధిలో ముందుకు నడిపిస్తాం

### కనిగిరిలో సీబీజీ ప్లాంట్

### భూమిపూజలో లోకేశ్



ఒంగోలు : ప్రకాశం జిల్లాని గుండెల్లో పెట్టుకుని అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేష్ అన్నారు. కనిగిరి నియోజకవర్గంలో సీబీజీ ప్లాంట్ కు భూమి పూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతు.. ప్రకాశం జిల్లా అంటే గుర్తుకొచ్చేది పౌరుషం, ప్రేమ.. 2019లో ఎదురు గాలి ఉన్నా నాలుగు సీట్లు గెలిపించారు.. 2024లో 10 సీట్ల లో గెలిపించారు. అమరావతి రాజధానిగా అందరి ఆమోదంతో ప్రకటించాం.. గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది.. వాటాలు ఇవ్వలేదని రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు తరిమేశారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి తెచ్చిన ప్రాజెక్టు గురించి చెప్పమని పులివెందుల ఎమ్మెల్యే కి సవాల్ చేశాను.. కానీ పులివెందుల ఎమ్మెల్యే నుండి సౌండ్ లేదు.. ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చాము. మా బ్రాండ్ సిబిఎన్.. ఎన్నికల్లో సైకో పాలనకి బైబై చెప్పారు.. రాష్ట్రానికి అనేక కంపెనీ రాబోతున్నాయి.. రిలయన్స్ ఫౌండేషన్ ధీరుబాయి అంబానీ, సీఎం చంద్రబాబు కి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి.. ఏపీ అంటే స్పీడ్ ఆఫ్ బిజినెస్ అని చూపిస్తాం.. కంప్రెస్డ్ బయో గ్యాస్ ఎ÷-లాంట్ లు ఏపీలో పెట్టేందుకు రిలయన్స్ ముందుకు వచ్చిందని తెలిపారు. మొదటి ప్లాంట్ నిర్మాణం కనిగిరిలో చేస్తున్నాం.. ఈ పెట్టుబడుల ద్వారా ఏపీలో 2.50లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.. కనిగిరిలో యువగళంలో ఇచ్చిన మొదటి హామీని నిలబెట్టు కున్నాను. సిబిజి ఎ÷-లాంట్ వలన రైతులకు మేలు జరుగుతుంది.. ప్రకాశం జిల్లా ఎప్పుడు వచ్చినా నా పాదయాత్ర గుర్తొస్తుంది. అందరూ నా చేతులు గీరారు... కొంత మంది కొరికారు. కనిగిరిలో రైల్వే ప్రాజెక్టు కోసం కృషి చేస్తాం.. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పవన్ కళ్యాణ్ ఏమనుకున్నా సాధించే వ్యక్తి.. పవన్ కళ్యాణ్ నాకు అన్న.. గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులు దుర్వినియోగం చేశారు.. పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లి మళ్లీ నిధులు తీసుకువచ్చారు.. వైసీపీ పరిస్థితి చూస్తే జాలేస్తుంది.. వాళ్లు పని చేయరు.. ఇంకొకరిని పని చేయనివ్వరు.. సిబిజి ప్లాంట్ కి వైసీపీ నాయకులు అడ్డుపడొద్దు.. అడ్డుపడే వాళ్ళ పేర్లు రెడ్ బుక్ లోకి ఎక్కుతాయి.. సైకో పాలనకి తెలుగుదేశం పార్టీ తగ్గేదే లేదని ఆనాడే చెప్పా.. 94 శాతం సీట్లలో ఎన్డీఏ కూటమిని గెలిపించారు.. త్వరలో ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేస్తామని లోకేష్ వెల్లడించారు.

# క్లైమాక్స్‌కు చేరిన చంద్రబాబు మోసాలు


### సూపర్ సిక్స్ పథకాలకు నిధులు లేవంటూ అబద్దాలు

### తెల్ల రేషన్ కార్డుదాల సంఖ్యను తగ్గించే ఎత్తులు

### స్థానిక ఎన్నికల్లో వేలుపెట్టి భంగపడ్డ టిడిపి

### స్థానిక ప్రజాప్రతినిధులతో వైకాపా అధినేత జగన్

అమరావతి : చంద్రబాబు మోసాలు క్లైమాక్స్‌కు చేరుకుంటున్నాయని, పి-4 అనే కొత్త మోసాన్ని మొదలుపెట్టాడని, మరోసారి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు.. వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశమైన ఆయన. కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సమాజంలో ఉన్న 20 శాతం పేదవాళ్ల బాగోగులకు 10 శాతం మందికి అప్పగిస్తాననడం దారుణమన్నారు. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయో చంద్రబాబుకు తెలుసా అన్నారు. రాష్ట్రంలో 1.61 కోట్ల కుటుంబాలు ఉంటే అందులో 1.48 కోట్ల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరంతా దారిద్య్రరేఖకు దిగువన ఉన్నారు. రాష్ట్రంలో ఆదాయ పన్ను కట్టేవారు ఎంతమంది ఉన్నారో చంద్రబాబుకు తెలుసా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో 8.6 లక్షల మంది ఇన్‌కంట్యాక్స్ కడుతున్నారు. ఆయన చెప్పిన ప్రకారం.. ఈ 1.48 కోట్ల మంది కుటుంబాలను 8.6 లక్షల మందికి అప్పగించాలి కదా? ఇన్ని రకాలుగా మోసాలు చేస్తాడు చంద్రబాబు. చివరకు చంద్రబాబు మీటింగ్‌ల నుంచి ప్రజలు వెళ్లిపోతున్నారు. చంద్రబాబుకు అన్నీ తెలుసు.. కానీ, కావాలనే మోసం చేస్తాడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గురించి అడిగితే రాష్ట్రం అప్పుల పాలు అంటాడు అంటూ ఎద్దేవా చేశారు. ప్రజలకు సమస్యలు వస్తే వాటి పరిష్కారంకోసం తపించే ప్రభుత్వం రావాలని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని తెలిపారు.. మాటచెప్తే.. ఆ మాటమీద నిలబడే ప్రభుత్వంకోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.. ఇక, మిమ్మల్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉందని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల సమావేశంలో వ్యాఖ్యానించారు.. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలని నమ్మే వ్యక్తిని.. నేను అలాగే ఉంటాను, పార్టీకూడా అలాగే ఉండాలని ప్రతిక్షణం ఆశిస్తున్నాను అన్నారు. ఉప ఎన్నికల్లో మీరు చూసిన తెగువకు, ధైర్యానికి హాట్సాఫ్.. మరో 50 చోట్ల ఎన్నికలు జరిగితే, 39 స్థానాలు వైయస్సార్‌సీపీ గెలిచింది.. కార్యకర్తలు తెగింపు చూపారు. తెలుగుదేశం పార్టీకి ఈ స్థానాల్లో ఎక్కడా గెలిచే నంబర్లు లేవు... వారికి సంఖ్యాబలం లేనే లేదు. కానీ, భయాందోళనల మధ్య ఎన్నికలు నిర్వహించాలనుకుంది. పోలీసులతో భయపెట్టి, బెదిరించారు. ఇన్ని సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నానని చెప్పుకుంటున్న చంద్రబాబుకి బుద్ధిలేదు అని విమర్శలు చేశారు. వాస్తవంగా ఈ ఎన్నికలను టీడీపీ వదిలేయాలి. కానీ, అధికార అహంకారంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చూశారు. నిజం ఇది ధర్మమేనా? న్యాయమేనా? అని ప్రశ్నించారు.. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోంది. ఈ 11 నెలల కాలంలో ఎక్కడా ఒక నాయకుడిలా చంద్రబాబు వ్యవహరించలేదు. ప్రజలకిచ్చిన హామీల విషయంలో మోసం చేశారు. 143 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారు. చంద్రబాబు పాలనలో అబద్ధాలు, మోసాలే కనిపిస్తున్నాయని దుయ్యబట్టారు..వైయస్సార్‌సీపీ పాలనలో ఏదో ఒక బటన్ నొక్కేవాళ్లం.. ఏదోరూపంలో ప్రతి కుటుంబానికీ మంచి జరిగింది అన్నారు జగన్.. ఇప్పుడు ప్రజల్లోకి కార్యకర్తలను పంపే పరిస్థితి చంద్రబాబుకు లేదు. తిరుపతి మున్సిపల్ ఉప ఎన్నికల్లో జరిగిన అక్రమాలను ప్రజలంతా చూశారు. విశాఖపట్నంలో కూడా అవిశ్వాస తీర్మానం పెట్టి, అక్కడ అక్రమాలు చేస్తున్నారు. మన కార్పొరేటర్లను కాపాడుకునే ప్రయత్నం మనవాళ్లు చేశారు. 40 వ వార్డు కార్పొరేటర్ ఇంటికి వెళ్లి.. ఆయన భార్యను భయపెట్టే ప్రయత్నం పోలీసులు చేశారు. రామగిరిలో 10 ఎంపీటీ-సీల్లో 9కి వైయస్సార్‌సీపీవే. కానీ అక్కడ ఎన్నిక జరగనీయకుండా అడ్డుకుంటున్నారు. భద్రత పేరుతో పోలీసులు తీసుకెళ్లి.. దారి మళ్లించి, స్వయంగా ఎస్సై.. ఎంపీటీ-సీలను కిడ్నాప్‌చేసే పరిస్థితి. అప్పటికీ వినకపోతే, ఏకంగా మండల కార్యాలయంలో నిర్బంధించి బైండోవర్ చేశారు. అంతటితో ఆగకుండా లింగమయ్య అనే బీసీ నాయకుడ్ని చంపేశారు. ప్రతి నియోజకవర్గంలో చంద్రబాబు ఇలాంటి దారుణాలు చేయిస్తున్నారు. ప్రభుత్వం అంటే ఇలాంటి పాలన చేస్తుందా?చంద్రబాబు సొంత నియోజకవర్గంలో 16కు 16 ఎంపీటీ-సీలు మనవాళ్లే. ఆరుగుర్ని ప్రలోభపెట్టి.. తీసుకెళ్లిపోయాడు. 9 మంది వైయస్సార్‌సీపీతోనే ఉన్నారు. వారిని ఎన్నికల కేంద్రానికి వెళ్లనీయకుండా పోలీసులు, టీ-డీపీ వాళ్లు అడ్డుకున్నారు. కోరం లేకపోయినా.. గెలిచామని డిక్లేర్ చేయించుకున్నారని ఆరోపించారు.. రాష్ట్రానికి సీఎం, కుప్పంకు ఎమ్మెల్యే చంద్రబాబే.. అయినా సరే.. ఒక చిన్నపదవికోసం ఇన్ని దారుణాలు చేశారు అని మండిపడ్డారు జగన్.. ఈ ఎన్నికల్లో నా చెల్లెమ్మలు, నా అక్కలు మరింత గట్టిగా నిలబడ్డారు. దీనికి నేను గర్వపడుతున్నాను. ఇలాంటి ఘటనలు జరుగుతున్న పార్టీ ప్రజాప్రతినిధులు గట్టిగా నిలబడి స్ఫూర్తిని చూపించారు. వీరు చూపించిన స్ఫూర్తి చిరస్థాయిగా ఉంటు-ంది. కష్టకాలంలో పార్టీ పట్ల మీరు చూపించిన నిబద్ధతకు మీ జగన్ ఎప్పుడూ రుణపడి ఉంటాడు. రాబోయే రోజులు మనవి.. కళ్లు మూసుకుంటే మూడేళ్లు గడిచిపోతాయి. వైయస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలుస్తుంది. ఈసారి కార్యకర్తలకోసం కచ్చితంగా పార్టీ నిలబడుతుంది. కోవిడ్ కారణంగా నేను కార్యకర్తలకు చేయాల్సినంత చేయలేకపోవచ్చు. జగన్ 2.క్ష దీనికి భిన్నంగా ఉంటుంది. కార్యకర్తలకోసం గట్టిగా నిలబడతాను అని హామీ ఇచ్చారు.



# విశాఖలో ప్రేమోన్మాది దాడిలో తల్లి మృతి

### కూతరు పరిస్థితి విషమం..ఆస్పత్రిలో చికిత్స

### నిందితుడని గంటల్లోనే పట్టుకున పోలీసులు

### ఘటనపై సిఎం బాబు, మంత్రి అనిత దిగ్భ్రాంతి

విశాఖపట్టణం : మధురవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. స్వయంకృషి నగర్‌లో ఓ అమ్మాయి, ఆమె తల్లిపై ప్రేమోన్మాది దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా.. కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ప్రేమను నిరాకరించిందనే కోపంతో మధురవాడ స్వయంకృషి నగర్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో యువతితో పాటు, ఆమె తల్లిపై ఓ వ్యక్తి కత్తితో అతి కిరాతకంగా దాడి చేసి పరారయ్యాడు. ఈ ఘటనలో తల్లి లక్ష్మి మృతిచెందారు. యువతి దివ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన యువకుడు నవీన్‌గా తెలుస్తోంది. బాధితురాలు డిగ్రీ చదువుకొని ఇంటి దగ్గర ఖాళీగా ఉందని సమాచారం. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని లక్ష్మి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ పేరుతో యువతిని నవీన్ అనే వ్యక్తి కొంత కాలంగా వేధింపులకు గురిచేశాడు. అయితే ప్రేమను నిరాకరించడంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించాడు. వెంటనే యువతి ఇంటికి వెళ్లిన యువకుడు కత్తితో యువతితో పాటు ఆమె తల్లిపైనా దాడికి తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడిన తల్లి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా.. యువతి తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం యువతి.. గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. 48 గంటలు గడిస్తే గాని ఆమె పరిస్థితి ఎలా ఉంది అనేది చెప్పలేమని వైద్యులు చెప్పారు. అయితే ఈ ఘటనలో యువతి కూడా మరణించినట్లు వార్తలు రావడంతో దీనిపై ఏసీపీ అప్పలరాజు మాట్లాడుతూ.. యువతికి చికిత్స జరుగుతోందని చెప్పారు. అలాగే విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి వెళ్లగా.. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, డీసీపీ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తల్లీకూతుళ్లపై ప్రేమోన్మాది దాడితో స్వయంకృషి నగర్‌లో ఒక్కసారిగా అలజడి నెలకొంది. మరోవైపు మధురవాడ ప్రేమోన్మాది ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలు దివ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. దివ్యకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రేమోన్మాదిని త్వరగా గాలించి పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దివ్య తల్లి లక్ష్మి మృతిపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దర్యాప్తులో భాగంగా బృందాలుగా ఏర్పడిన పోలీసులు నవీన్ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని శ్రీకాకుళం సమీపంలో అదుపులోకి తీసుకొని విశాఖ తరలిస్తున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ప్రేమోన్మాది ఘాతుకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

# ఆడుదాం ఆంధ్రాలో ఎక్కడా అవినీతి లేదు

### ఎన్ని కేసులు పెట్టుకున్నా భయపడేది లేదు

### అరెస్ట్ చేసి సంబరాలు చేసుకోవడమే మీ లక్ష్యమా

### మాజీమంత్రి ఆర్‌కె రోజా ఘాటు వ్యాఖ్యలు

అమరావతి : ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారన్న భయంతో కేసులు పెడుతున్నారని వైసిపి నేత మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే కేసులు పెట్టండి. మీరు ఎన్ని కేసులు పెట్టినా మేము సిద్ధంగా ఉన్నాం అని సవాల్ చేశారు.. ఆడుదాం ఆంధ్రాలో అవినీతి జరగలేదు. నిబంధనల ప్రకారం ఆడుదాం ఆంధ్రా నిర్వహించాం.. శాప్ చైర్మన్ కు, స్పోర్ట్స్ మినిస్టర్ కు ఏమి సంబంధం లేదని స్పష్టం చేవారు. అసెంబ్లీలో, మండలిలో ఆడుదాం ఆంధ్రాలో ఏ అవినీతి జరగలేదని నివేదిక ఇచ్చారు. రోజాను, కొడాలి నాని, అంబటి రాంబాబు, పేర్ని నానినీ అరెస్టు చేసి సంబరాలు చేసుకోవాలని చూస్తున్నారు.. మేం భయపడబోం అని అన్నారు..ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రోజా.. ఘాటు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, లోకేష్ కుటుంబాలను బంగారుమయం చేసుకుంటారేమో.. కానీ, పేద ప్రజలకు చేసేదేమీ లేదన్నారు.. చంద్రబాబు మీటింగులకు వచ్చిన జనం మధ్యలోనే వెళ్లిపోతున్నారు.. ఇక, పవన్ కల్యాణ్ ఎక్కడ నిద్రపోతున్నారో అర్థం కావటం లేదని ఎద్దేవా చేశారు. మొన్న వీళ్ల వెకిలి డ్యాన్సులకు పడిపడి నవ్వారు.. తిరుమలలో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నా ఈ సనాతన యోధుడు ప్రశ్నించటం లేదు.. తిరుమలలో జరిగిన అన్యాయాలు ప్రశ్నించే బాధ్యత మీకు లేదా..? వక్ఫ్ బిల్లుపై వీరు చేస్తున్న వ్యవహారాన్ని రాష్ట్రంలో ఉన్న ముస్లింలు మొత్తం చూస్తున్నారు.. అసలు, బీజేపీకి భయపడి పవన్ కల్యాణ్ ఎక్కడా ఇఫ్తార్ లో కూడా పాల్గొనలేదన్నారు.. వైసీపీలో గట్టిగా మాట్లాడే వారిని టార్గెట్ చేస్తున్న కూటమి ప్రభుత్వం.. ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులతో భయపెట్టాలని చేస్తున్నారు.. రాబోయే రోజుల్లో వాళ్ళ నేతలు కూడా చూస్తారని హెచ్చరించారు.. ఇంతవరకు ఆడుదాం ఆంధ్రపై కేసులు బుక్ అవ్వలేదు.. అసెంబ్లీలో ఇప్పటికే అన్నీ విషయాలు స్పష్టంగా చెప్పాం.. ఈ వ్యవహారంలో నాకు, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఏం సంబంధం లేదన్నారు. లోపల ఒక మాట, బయట ఒక మాట మాట్లాడుతున్నారు.. అంతా పారదర్శకంగా జరిగింది.. రోజాని అరెస్ట్ చేసి సంబరాలు చేసుకోవాలనే ఆశ ఉంది.. కొడాలి నాని, పేర్ని నాని, అంబటి రాంబాబును అరెస్ట్ చేయించాలనే ఆలోచన తప్ప మరొకటి లేదన్నారు. మాజీ మంత్రుల అరెస్టులు, వరుసగా నమోదవుతున్న కేసులపై స్పందించిన రోజా.. వైసీపీలో బలమైన నాయకత్వాన్ని తొక్కడానికి వాళ్ల నోట్లు నొక్కడానికి కేసులు పెడుతున్నారని రోజా మండిపడ్డారు.

# ఆంధ్రలో తొలి బర్డ్‌ఫ్లూ మరణం

### వ్యాధి సోకి చిన్నారి మృతి

పల్నాడు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తొలి బర్డ్ ఫ్లూ మరణం సంభవించింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకి చెందిన రెండేళ్ల చిన్నారి బర్డ్ ఫ్లూ వైరస్ తో మృతి చెందింది. పచ్చి కోడి మాంసం తినడం వల్ల బర్డ్ ఫ్లూ సోకి మరణించిందని ఎయిమ్స్ వైద్యులు ధృవీకరించారు. గత నెల 4వ తేదీన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో మంగళగిరి ఎయిమ్స్‌లో చిన్నారిని జాయిన్ చేశారు. చిన్నారి మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. అయితే, చికిత్స అందించే సమయంలో చిన్నారి గొంతు, ముక్కు నుంచి స్వాబ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. నివేదిక అనుమానంగా రావడంతో పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్ కు శాంపిల్స్ పంపారు వైద్యులు. అయితే, చిన్నారికి హెచ్5 ఎన్1 వైరస్‌గా నిర్ధారణ అయింది. బర్డ్ ఫ్లూ మృతిగా తేలడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూ తో మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యుల నుంచి శ్వాబ్ శాంపిల్స్ డాక్టర్లు సేకరించారు. ముందు జాగ్రత్తగా మరిన్ని వైద్య పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకున్నారు. శ్వాబ్ శాంపిల్స్ ను ఎయిమ్స్, పూణే వైరాలజీ ల్యాబ్ కు అధికారులు పంపనున్నారు. చుట్టుపక్కల ఎవరూ జ్వరంతో బాధపడడం లేదని గుర్తించారు. చిన్నారి కుటు-ంబం నివాసం ఉండే ఇంటికి కిలోమీటరు దూరంలో మాంసం దుకాణం నిర్వహిస్తున్నట్లు- వైద్యాధికారులు గుర్తించారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మార్చ్ 4న పాపకి జ్వరం రావడంతో నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాం.. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళగిరి ఎయిమ్స్ లో జాయిన్ చేశారు.. 10 రోజుల చికిత్స తర్వాత పాప చనిపోవడం జరిగింది.. వైద్యులకు అనుమానం వచ్చి పూణే ల్యాబ్ కి రక్త నమూనాలు పంపించారు. నిన్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇంటికి వచ్చి మీ పాప బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోయింది అని చిన్నారి పెద్దనాన్న చెప్పారు.

## హెచ్‌సీయూ భూముల వివాదంపై అనసూయ కామెంట్

హైదరాబాద్ : హెచ్‌సీయూ విద్యార్థులకు పలువురు రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు సైతం సపోర్ట్ అందిస్తున్నారు. కల్కి డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్పందిస్తూ..ఐటీ పార్క్ కోసం 400 ఎకరాల చెట్లని ధ్వంసం చేయడం ఎందుకు .. డెవలప్ చేయాలి అంటే చెట్లు లేని భూములు చాలా ఉన్నాయి కదా అని నాగ్ అశ్విన్ ఇటీవల ప్రశ్నించారు. రేణూ దేశాయ్ కూడా చాలా ఎమోషనల్‌గా దీనిపై స్పందించింది. ఐటీ పార్కులు, ఆకాశాన్ని తాకే భవనాలు అన్నీ అవసరమే. కానీ కుదిరితే ఈ ఒక్క 400 ఎకరాలు వదిలేయండి. తెలంగాణ సిటిజన్ గా నేను వేడుకుంటున్నా. దయచేసి ఏదో విధంగా దీనిని ఆపండి సార్. ఒక తల్లిగా మాత్రమే నేను రిక్వెస్ట్ చేస్తున్నా. ఆ 400 ఎకరాల్లో విధ్వంసం వద్దు అని రేణు దేశాయ్ వేడుకున్నారు. రష్మీ, ప్రకాశ్ రాజ్ ఇలా పలువురు తమ వాదనలు వినిపిస్తున్నారు. ఇప్పుడు ఇదే లిస్ట్‌లో అనసూయ కూడా చేరింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేస్తూ.. ఇది నిజంగా హార్ట్ బ్రేకింగ్ అంటూ రాసుకొచ్చింది. పచ్చని అడివి పూడ్చివేసే రోజు వచ్చింది. ఎరుపు రంగులో ఉన్న చెట్లు నేలకూలాయి అంటూ కామెంట్ పెట్టింది. ఇలా అనసూయ కూడా హెచ్‌సీయూ వివాదంపై తన సపోర్ట్ తెలియజేసింది. ఇక రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగుతూనే ఉంది. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టి బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కాకాణి కోసం పోలీసుల వేట

### హైదరాబాద్‌కు ఎపి పోలీసుల రాక

### బంధువులకు నోటీసులు ఇచ్చి తిరుగు పయనం

అమరావతి : మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధ రెడ్డి కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. తాజాగా హైదరాబాద్‌లోని కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లారు. కాకాణిపై అక్రమ మైనింగ్ కేసుతో పాటు- ఎస్సీ ఎస్టీ కేసు కూడా నమోదు అయ్యింది. ఇప్పటికే విచారణకు రావాలంటూ కాకాణికి రెండు సార్లు నోటీ-సులు ఇచ్చారు. అయినప్పటికీ విచారణకు మాజీ మంత్రి డుమ్మా కొట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని కాకాణి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్రమమైనింగ్‌కు సంబంధించి రెండు సార్లు కాకాణికి పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. నిన్న (మంగళవారం) మాజీ మంత్రి విచారణకు రావాల్సి ఉంది. అయితే నిన్నటి విచారణకు కాకాణి గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకున్న ఏపీ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. హైదరాబాద్‌లో కాకాణికి మూడు నివాసాలు ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్‌లోని నివాసానికి నెల్లూరు జిల్లా కావలి సీఐతో పాటు మనుబోలు ఎస్ఐ, సిబ్బంది వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు నెల్లూరు పోలీసులు కాకాణిని కలుసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన తప్పించుకుని తిరుగుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు రాగా.. తప్పించుకుని తిరుగుతున్నట్లు- తెలుస్తోంది. వివిధ రకాలుగా పోలీసులు ఆయన తప్పుదోపట్టిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన బంధువులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఏ సమయానికి విచారణకు రావాలి అన్న అంశాలను అందులో స్పష్టంగా చెప్పారు. అక్రమైనింగ్ కేసు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ- కేసులో ముందస్తు బెయిల్ కోసం కాకాణి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పోలీసులకు సహకరిస్తానని చెబుతూనూ పలుమార్లు విచారణకు కాకాణి డుమ్మా కొట్టారు. ఆయన మొబైల్ సిగ్నల్ ఆధారంగా కాకాణి ఎక్కడున్నారో తెలుసుకుని అక్కడికెళ్లి నోటీసు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు పోలీసులు. .

## రాజధాని బైపాస్ రోడ్లకు గ్రీన్ సిగ్నల్

### త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలు

అమరావతి : రాజధాని అమరావతి ప్రాంతంలో ముమ్మరంగా కార్యకలాపాలు మొదలైన నేపథ్యంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే బైపాస్ తక్షణమే అందుబాటులోకి వచ్చేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డైరెక్షన్స్ ఇచ్చారు. దీంతో రాజధాని ప్రాంతానికి కీలక జాతీయ రహదారి అందుబాటులోకి రావడమే కాకుండా, అక్కడి నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను సులువుగా తరలించేందుకు కూడా అవకాశం ఏర్పడుతుంది. కాజా నుంచి గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు ఉన్న విజయవాడ బైపాస్ (చెన్నై-కోల్‌కతా హైవే బైపాస్) ఉంది. అందులోని కాజా - గొల్లపూడి ప్యాకేజీ 17.88 కిలోమీటర్లు. ఇది రాజధాని ప్రాంతంలోని 9 గ్రిడ్ రోడ్ల మీదుగా వెళ్తుంది. దీనివల్ల ఆయా గ్రిడ్ రోడ్లలో రాకపోకలు సాగించే వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. గ్రిడ్ రోడ్ల వద్ద మాత్రం అండర్‌పాస్‌లు లేకుండానే, బైపాస్ నిర్మాణ పనులు పూర్తియయ్యిపోయాయి. దీంతో బైపాస్ క్రాస్ అయ్యేప్రాంతాల్లో ఆ నాలుగు గ్రిడ్ రోడ్లు శాశ్వతంగా మూసుకుపోతాయి. ఈ గ్రిడ్ రోడ్లపై రాకపోకలు సాగించేవారు.. బైపాస్ దాటి వెళ్లాలంటే మరో ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలిసినా గత ప్రభుత్వ హయాంలో ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు పనులు చేసేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు లేని విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి రావడంతో ఎట్టిపరిస్థితుల్లోనూ అక్కడ అండర్‌పాస్‌లు ఉండాల్సిందేనని ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆ నాలుగు చోట్ల బైపాస్‌ను కట్‌చేసి, అండర్‌పాస్‌ల నిర్మాణానికి అంచనాలు రూపొందించే ఎ÷-లాన్ ఆఫ్ యాక్షన్ జరుగుతుంది. తాజాగా సీఎం చంద్రబాబు, కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి గడ్కరీతో సమావేశం అయ్యి ఇదే అంశంపై చేర్చించారు. రాజధాని పనులు వేగంగా జరుగుతున్న వేళ మొదట బైపాస్ నిర్మాణం పూర్తిచేయాలని, ఆ తర్వాత నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించేలా ఇద్దరూ మాట్లాడుకుని, నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ ప్రస్తుతం బైపాస్ ఆపేసి, నాలుగు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తిచేయాలంటే మరో 15 నెలల సమయం పట్టే అవకాశం ఉంది.



# అద్భుత చిత్రరాజం..ఆదిత్య 369

అప్పట్లో ఆదిత్య-369 అద్భుత విజయం సాధించింది. అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది. దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడింది. ఆయన ప్రతిభన్ మరోమరాఉ చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు- ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్టు అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు. హీరోయిన్‌గా విజయశాంతి బాగుంటుందని కృష్ణప్రసాద్, బాలకృష్ణ అనుకున్నారు. డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె నటించలేకపోయారు. ఓ దర్శకుడు మోహిని గురించి చెప్పగా.. ఆడిషన్ చేసి కథానాయికగా ఆమెను ఎంపిక చేశాం. బాలీవుడ్ నటుడు టీనూఆనంద్‌ను ప్రొఫెసర్ పాత్రకు తీసుకున్నామని అన్నారు. టైటిల్ విషయంలో కృష్ణప్రసాద్ ఏమైనా అనుకుని ఉండొచ్చుగానీ నేను ముందు నుంచీ 'ఆదిత్య' పేరునే ఫిక్స్ అయ్యా. అలా 'ఆదిత్య 369' అయిందని సింగీతం వివరించారు.



# ఆలియా భట్‌తో పోల్చకండి ప్లీజ్....

## నటి షాలినీ పాండే వెల్లడి

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.








# చిరంజీవితో వినూత్నంగా వీడియో

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం మెగా 157-వర్కింగ్ -టైటిల్ ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ-ఇవ్వగా, చిరంజీవి 'గోదారి గట్టు-' పాట నుంచి కొన్ని లైన్లు ఆలపించి ఎంటర్‌టైన్ చేశారు. ఇలా సాంకేతిక వర్గాన్ని పరిచయం చేస్తూ సగిన వీడియ మెగా అభిమానుల్లో జోష్ నింపింది.

# రెండో సినిమా ప్రకటించిన నీహారిక

## సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ

మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడింది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ- కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు- ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ ప్రాజెక్ట్‌కి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు

# చిరంజీవితో నాని సినిమా

## అంచాలను పెంచిన ప్రకటన

నేచురల్ స్టార్ నాని ఇప్పుడు హీరోగా కన్నా నిర్మాతగానే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కారణం ఆయన చేసే ప్రతి సినిమా కూడా సూపర్ హిట్ అవుతుంది. రీసెంట్‌గా కోర్ట్ అనే సినిమాతో పెద్ద విజయం సాధించారు. ఈ క్రమంలో నాని అంటే మంచి సినిమాలు చేస్తాడని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, కూడా ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం నాని శైలేష్ కొలను దర్శకత్వంలో సొంత బ్యానర్ లో హిట్3 సినిమా చేస్తున్నాడు. అలానే ది ప్యారడైజ్ అనే చిత్రంలోను నటిస్తున్నాడు. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. త్వరలో దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ ప్రాజెక్ట్ చేయనుండగా, దీనికి నాని సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు బాగా ఉన్నాయి. అందుకు కారణం ఈసారి మళ్లీ రక్తం పారాల్సిందే అంటూ శ్రీకాంత్ చాలా వయొలెంట్ సినిమా చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీని గురించి తాజా ఇంటర్వ్యూలో నాని మాట్లాడుతూ.. చిరంజీవి గారు అనగానే డ్యాన్స్, యాక్షన్ అని మనం ఒక అభిప్రాయానికి వచ్చేశాం..కానీ ఆయన అంతుకుమించి.. చిరంజీవి కేవలం అది మాత్రమే కాదు.. ఆయన్ని ప్రతి ఫ్యామిలీలో ఒక మెంబర్‌గా భావిస్తాం.. కానీ ఆ విషయాన్ని మనం మర్చిపోయి వేరే దేనిపైన ఫోకస్ చేస్తున్నాం. ఇప్పుడు శ్రీకాంత్ మ్యాడ్‌నెస్‌ని చిరంజీవి గారి సినిమా అంటే అది చాలా సూపర్ కాంబో.. అసలు నా లైఫ్‌లో చిరంజీవి గారి లాంటి స్థాయి వ్యక్తిని పెట్టి నేను ఓ సినిమా తీస్తానని ఎప్పుడూ ఊహించలేదు.. కానీ అనుకోకుండా ఇది కుదిరింది.. ఇది గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. ఖచ్చితంగా ది బెస్ట్ ఇస్తాం అంటూ నాని కామెంట్స్ చేశారు. ప్రస్తుతం నాని చేసిన కామెంట్స్‌తో మూవీపై అంచనాలు అమాంతం పెరిగాయి. నాని, చిరంజీవికి ఈ ప్రాజెక్ట్ మెమోరబుల్‌గా ఉండడం ఖాయమని అంటున్నారు.. ఈ వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

# నేను ఎవరితో డేటింగ్‌లో లేను : దివ్య భారతి

తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ గాయని సైంధవి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే జీవీ విడాకులు తీసుకోవడానికి కారణం హీరోయిన్ దివ్య భారతితో ప్రేమలో ఉన్నందుకే అంటూ సోషల్ మీడియాలో పుకార్లు పుట్టుకొచ్చాయి. ఈ వివాదంపై జీవీ ప్రకాశ్‌తో పాటు దివ్యభారతి గతంలోనే స్పందించారు. అయితే ఈ వివాదం ఇంకా ముగియకపోవడంతో తాజాగా ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టింది దివ్యా భారతి. నాకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల కుటుంబపు విషయాల్లో నా పేరును లాగుతున్నారు. జీవీ ప్రకాశ్ కుటుంబ సమస్యలతో నాకు ఎటువంటి లింక్ లేదు. నేను ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. నేను ఎవరితోనూ డేటింగ్‌లో లేను. ముఖ్యంగా పెళ్లైన వ్యక్తితో డేటింగ్ అసలే చేయను. ఆధారాలు లేకుండా రూమర్స్‌ను పుట్టించొద్దు. ఇప్పటివరకూ ఈ విషయంపై నేను నోరు మెదపలేదు. కానీ, కొన్ని రోజులుగా ఈ రూమర్స్ నా సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఈ గాసిప్‌ల వల్ల నా పేరు చెడిపోతోంది. తప్పుడు వార్తలు సృష్టించడం కంటే సమాజానికి ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టండి. నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి. ఈ విషయంపై ఇదే నా తొలి మరియు చివరి ప్రకటన అని దివ్య భారతి చెప్పుకోచ్చింది. దివ్య భారతి, జీవీ కలిసి బ్యాచిలర్, కింగ్‌స్టన్ మూవీలో నటించారు. ఈ క్రమంలో వీరిద్దరు రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com